# నేను రచయిత్రిని కాను

"పోస్ట్!"

వాకిట్లోంచి కేక వినగానే అమ్మదగ్గర కూర్చుని పూసల బాగ్ అల్లుకుంటున్న నేను, చదువుకుంటున్న చిన్నన్నయ్య, ప్రక్కగదిలో బాబుని నిద్రపుచ్చుతున్న పెద్ద వదిన, ఒక్కసారి బయటికి పరుగెత్తాం. గాలి దుమారంలా ఒక్క ఉమ్మడిగా దూసుకు వచ్చిన మా ముగ్గుర్ని పోస్టుమాన్ కనుబొమలు ముడిచి సీరియస్‌గా చూశాడు. అతని చేతిలో పెద్ద రిజిష్టర్ కవరు ఒకటుంది.

"ఉత్తరాలేవీ లేవూ?" అంది వదిన.

"ఇంటర్వ్యూ కార్డేమో అనుకున్నాను" అన్నాను నేనుకూడా నిరాశగా. రెండునెలలనుంచి నేను ఉద్యోగ ప్రయత్నంలో వున్నాను.

"ఈరోజు కూడా మా శ్యామల దగ్గరనుంచి ఉత్తరం రాలేదు" అనుకుంటూ వదిన వెళ్ళిపోయింది. నేనుకూడా వెనక్కు తిరిగి వెళ్ళిపోబోయాను. కాని చిత్తరువులా నిలబడిపోయిన చిన్నన్నయ్యని చూసి తటపటాయిస్తూ ఆగిపోయాను. అన్నయ్య ముఖంలో కన్పిస్తున్న భయంకరమైన భావం నా మనస్సులో చురుక్కున నాటుకుని కలుక్కుమంది.

"యస్ రామకృష్ణ" పోస్టుమాన్ అడ్రస్ చూస్తూ అన్నాడు. అప్పటికే నాకు అదేమిటో తెలిసిపోయింది. అన్నయ్య కళ్ళల్లో కనిపిస్తున్న నిరాశామిశ్రితమైన దృక్కులకి అర్థంకూడాఅవగాహనమైంది. అదిదాదాపు రెండు నెలల క్రితం మా అన్నయ్య మాంచిమూడ్‌లోకూర్చుని రాత్రింబవళ్ళు నిద్రాహారాలు లేకుండా కాలంసంగతి మర్చిపోయి తను

అందులో లీనమైపోయి వ్రాసిన నవల. అలవాటు ప్రకారం యే మాగజైన్‌కో వెళ్ళి క్షేమంగా తిరిగివచ్చింది. వణుకుతున్న చేతుల్తో సంతకం చేసి అన్నయ్య కవరు తీసుకున్నాడు. సాధారణంగా మామూలు పరిస్థితిల్లో నాకూ చిన్నన్నయ్యకీ అంతగా పడదు. ఇంకో యింకో సమయంలో అయితే యీ అపజయానికి మనసారా సంతోషించేదాన్ని. విరగబడి నవ్వి చప్పట్లు చరిచి "మా బాగా అయింది, రోగం కుదిరింది" అని హేళన చేసేదాన్ని. కాని, ఇప్పుడు అన్నయ్యలో కన్పిస్తున్న ఈ భయంకరమైన నిరాశ చూసే సరికి జాలి వేసింది. ఏడుపుకూడా వచ్చింది. ఎంతయినా మా చిన్నన్నయ్య! ఆ క్షణంలో నాకు తెలియని ఆ పత్రికాధిపతిని నమిలి మింగెయ్యాలన్నంత కోపం వచ్చింది.

"అన్నయ్యా!" అన్నాను. అప్పటికే పోస్టుమాన్ వెళ్ళిపోయాడు. చేతిలో పార్శిల్ అలా పట్టుకుని దిగ్భ్రాంతుడయిపోయినట్టు చలనం లేకుండా శూన్యంలోకి చూస్తున్న అన్నయ్య పలకలేదు.

"అన్నయ్యా!" దగ్గరగా వెళ్ళి భుజంమీద చేయివేస్తూ పిలిచాను. వాడిని పిలవటంలో అంత ఆప్యాయత కన్పరచగలనని నేనెప్పుడూ కల్లో కూడా అనుకోలేదు.

చిన్నన్నయ్య శూన్య దృక్కులని నావైపు మళ్ళించాడు. ఆకళ్ళు వూరికే నా వైపు చూస్తున్నాయి, అంతే. వాటిల్లో జీవం బొత్తిగా లేదు. నావయిపు చూస్తుండగానే వాటిల్లోకి చలనం వచ్చింది. వెంటనే గిర్రున నీళ్ళు తిరిగాయి. నా మనసు గిలగిలలాడింది. పెదవులు యేదో చెప్పటానికి తెరుచుకునే లోపలే "రాధా!" అంటూ ఆ పార్శిల్ నా రెండు చేతుల్లో పెట్టి, వెంటనే ముఖం తిప్పేసుకుని గిరుక్కున తిరిగి రెండంగల్లో గదిలోకి వెళ్ళిపోయి భళ్ళునతలుపులు మూసుకున్నాడు. అంతా రెప్పపాటులో జరిగిపోయింది. ఈసారి తెల్లబోయి నిలబడటం నావంతయింది. మూసుకున్న తలుపులు ఒక్క వూపులో తెరుచుకున్నాయి. వాటిమధ్య నుంచి తలమాత్రం బైట పెట్టి, "రాధా! ఆ కథని తగులబెట్టెయ్. దాని ముఖం నాకు చూపించకు" అన్నాడు. ఆ మాటలువచ్చి పూర్తిగా నా చెవుల్లో ప్రవేశించక మునుపే తలుపులు మళ్ళీ రపీమని మూసుకున్నాయి. అచేతనంగా నిలబడిపోయిన నేను చేతిలో కవరువంక

దిగులుగా చూశాను. తలుపులు మళ్ళీ తెరచుకున్నాయి. "రాధా! ఆ కథ నేనెంత కష్టపడి వ్రాశానో, దానిమీద యెన్ని ఆశలు పెట్టుకున్నానో నీకు తెలుసుగా, అయినా సరే తగులబెట్టేయ్" అన్నాడు.

మూసుకున్న తలుపులు మళ్ళీ తెరుచుకుంటాయేమోనని ఎంతో ఆశగా ఓపికగా ఎదురుచూచాను. కాని అలాంటిదేం జరగలేదు. నాలో ఉత్సాహం కూడా చచ్చిపోయింది. నిజం! అన్నయ్య ఆ కథ ఎంత కష్టపడి వ్రాశాడో స్వయంగా నాకంటె ఎక్కువగా ఇంకెవరికి తెలుస్తుంది? అది వ్రాసేటప్పుడల్లా కాఫీ యివ్వటం, రాత్రిళ్ళు ఆలస్యంగా భోజనానికి వస్తే అమ్మా-వదినా నిద్రపోయినా నేను మేల్కొని కూర్చుని భోజనం పెట్టడం, వ్రాసి, వ్రాసి అలసిపోయి కాగితాలన్నీ అలాగే వది లేసి వాటిమీదేవడి నిద్రపోతుంటే అవన్నీ జాగ్రత్తగా సరిచేసి బొత్తి పెట్టడం ఇలాంటి సపర్యలు ఎన్ని చేశానో? అన్నయ్య కష్టపడి వ్రాశాడు. దానికి తగిన సదుపాయాలు అంతకంటే ఎక్కువ కష్టపడి నేను చేశాను. కాని ఫలితం లేకపోయింది. కథ చివర ఎక్కడైనా ఆ పత్రికాధిపతికి "ఏమండోయ్! నేనుకూడా చాలా కష్టపడ్డాను. నిరాశ పరచకండి" అంటూ వో వాక్యం వ్రాసి జతచేసినా బాగుండేదేమో!

చిన్నన్నయ్య కథలు ఇలా తిరిగి రావటం మాకు కొత్తయేమీకాదు. ఒక్కమాటలో సూటిగా చెప్పాలంటే నాకు బుద్ధి తెలిసినప్పటినుంచి వాడు కథలు వ్రాసి పోస్టు చేస్తూనేవున్నాడు, అవి నిక్షేపంగా, క్షేమంగా తిరిగి వస్తూనే వున్నాయి. ఒక్కోసారి తిరిగి వంపడంలో ఆ పత్రికాధిపతులు చూపించేశ్రద్ధకి నాలో నేనేఆశ్చర్యపోతూ ఉండేదాన్ని. తిరిగివచ్చినాయని, ఒక్కటికూడా మచ్చుకి ప్రచురించ బడలేదని వీడు నిరాశపడేవాడు కాదు. వ్రాస్తూనే ఉండేవాడు. నేను పెరిగినకొద్దీ నాతోపాటు అన్నయ్య చిన్న చిన్న కథలు పెద్ద కథలుగా, నవలలుగా, నాటకాలుగా, రూపొంది నాయి.

ఈ కథల పిచ్చిలో పడే వాడు బి.ఏ. నాలుగుసార్లు కట్టికూడా పాస్ కాలేకపోయాడు. మా పెద్దన్నయ్య ఎంతో కష్టపడి తన పలుకుబడి ఉపయోగించి ఇప్పించిన మూడు ఉద్యోగాలు సకాలంలో వెళ్ళక, సరిగా పనిచేయక, చేసిన దానిమీదశ్రద్ధలేక వాటిని పోగొట్టుకున్నాడు.

అదృష్టవశాత్తూ మా పెద్దన్నయ్య దేవుడు కాబట్టి సరిపోయింది. మా నాన్నగారు లేనిలోటును ఎప్పుడూ, ఎందులో మాకు తెలియనీయకుండా పెంచి పెద్దచేశాడు. ఇక ఉద్యోగానికి చిన్నన్నయ్యకి చుక్క ఎదురని గ్రహించి, పోనేరా! ఇంట్లోనే వుండి ఆ కథలేమిటో జాగ్రత్తగా రాసుకో, అన్నాడు. అమ్మకిది ఇష్టంలేదు. ఇల్లు గడిచే బాధ్యత అంతా పెద్దన్నయ్య మీద వుంది. తనకి వచ్చే ఆరువందల రూపాయలతోనే మా ఇంటి ఖర్చంతా వెళ్ళదీసుకోవాలి. అలాగే తినో, తినకో మా ఇద్దరికీ చదువులు కూడా చెప్పించాడు. ధరలు ఆకాశంలో వున్న ఈ రోజుల్లో అన్నయ్య సంపాదన ఏ మూలకి! అదికాకుండా నేను పెళ్ళికి ఎదిగి కూర్చున్నాను. అమ్మ అప్పుడప్పుడు పెద్ద అన్నయ్యతో "అత్యాశలకిపోక ఈ గుండెలమీద కుంపటిని ఏదో విధంగా దించరా నాయనా!" అనేది. అన్నయ్య నవ్వి, "నేనేం చెయ్యనమ్మా! అది ఇప్పుడప్పుడే చేసుకోను అని అంత ఖచ్చితంగా చెప్తుంటే" అనేవాడు. అవునుమరి! ఎలా చేసుకుంటాను. అన్నయ్యకి అయిన అప్పులో కనీసం సగం అయినా తీరేదాకా పెళ్ళి చేసుకో కూడదని నేను గట్టిగా నిశ్చయించుకున్నాను. అందుకే ఉద్యోగ ప్రయత్నం చేస్తున్నాను.

మధ్యాహ్నం రెండు గంటలకి వెళ్ళి తలుపులు మూసుకున్న చిన్నన్నయ్యని సాయంత్రం ఆరు గంటలు అయినా తలుపులు తీయించలేకపోయినాం, చివరికి వదిన పిలుపుకూడా పనిచేయలేదు. కాఫీగ్లాసు చేత్తోపట్టుకుని "రామూ! తలుపులు తీయవా? నేను నీ వదినని కాదా?" అంటూ బ్రతిమాలడం ప్రారంభించింది.

"వెధవ కథ పడకపోతే పోయింది. అందుకని ఇంట్లో అందరి ప్రాణం ఇలా వేపుకు తినాలా? పనికిమాలిన వెధవా!" అమ్మ విసుక్కుంది.

వదిన అమ్మవైపు చురచురా చూసింది! "మీరు వూరుకోండి అత్తగారూ! అతనసలే అంత బాధలో వుంటే మధ్యలో మీ తిట్లేమిటీ" అంది. పెద్దన్నయ్య నన్ను గారాబం చేస్తాడు. వదినకి మా చిన్నన్నయ్య అంటే ప్రాణం. వదిన నావైపు చూసింది. అందులో అర్థం నాకు తెలుసు. అన్ని అనర్థాలూ అపిడ ముద్దుల మరదివే వస్తాయి. నాకు ఏవీ రావు.

వాళ్ళిప్పుడు ఓడిపోయిన పక్షం వాళ్ళు. నేనూ పెద్దన్నయ్యా ఒక పార్టీ' ఆవిడా చిన్నన్నయ్యా ఇంకోపార్టీ. అమ్మ సమయాన్ని బట్టి అటో ఇటో చేరుతుంది.

వదిన ఎంత పిలిచినా లాభం లేకపోయింది. చిన్నన్నయ్య తలుపు తీయలేదు.

పెద్దన్నయ్య ఆ రోజు సాయంత్రం ఇంటికి వస్తూనే 'అమ్మా రాధేది?' అని రాధా, రాధా అని పిలిచాడు. ఆ పిలుపులో ఆప్యాయత, ఆత్రం, సంతోషం అన్నీ వున్నాయి. మధ్యాహ్నం నుంచి చిన్నన్నయ్య గొడవతో, అనవసరంగా వదిన విసిరే సూటీపోటీ మాటల్తో అదోలావున్న నేను పరధ్యానంగా దగ్గరికివెడ్తూ "యేమిటి?" అన్నాను. అన్నయ్య వెంటనే రెండుచేతులు పట్టుకుని గిరగిరాతిప్పి ఆగగానే నుదురుమీద ముద్దుపెట్టుకున్నాడు.

వదిన, అమ్మ వింతగా చూస్తున్నారు.

"నీకేం కావాలో కోరుకో!" అన్నాడు. ఎందుకో తెలియదు కాని అన్నయ్య కళ్ళు సంతోషంతో గర్వంతో మెరిసిపోతున్నాయి.

"ఏమిట్రా? అసలుసంగతేమిటీ"" అంది అమ్మ.

"లాటరీలో రాధ పేరుమీద గాద్రేజ్ బీరువా వచ్చిందమ్మా! అప్పుడెప్పుడో తమాషాకి రూపాయిపెట్టి రాధ పేరుమీద కొన్నాను"

నేను వదినవైపు చూడకుండా ఉండలేకపోయాను. ఖర్మ! ఈ విజయం నాకీరోజే రావాలా?

"మీ సంతోషాలు, సరదాలు తర్వాత చూద్దాం. ముందు కాస్త ఆ రాము సంగతి చూడండి!" వదిన రుసరుసలాడ్తూ కాఫీ తెచ్చి ఇచ్చింది.

"ఏం ఏమైంది?" ఆదుర్దాగా అడిగాడు అన్నయ్య.

వదిన సంగతంతా ముఖావంగా మూడు ముక్కల్లో చెప్పింది. అన్నయ్య బూటు విప్పిన మనిషి మేజోళ్ళు కూడా విప్పకుండా, త్రాగబోతున్న కాఫీ అగిపోయి, ఆగ్లాసు వదినకిచ్చేసి వెళ్ళి చిన్నన్నయ్య గది తలుపు తట్టాడు.

"రామూ!" మామూలుగానే పిలిచాడు.

లోపలనుంచి సమాధానం రాలేదు.

"రామూ!" ఈసారి కంఠం గంభీరంగా మారింది.

"నిన్నేరా! పెద్దాడు పిలుస్తుంటే కూడా విన్పించలేదా, మాట్లాడ వేం?" అమ్మ కోపంగా అంది.

మూసుకుని చలనం లేనట్టున్న తలుపులు ఒక్కసారిగా గభాల్న తెరుచుకున్నాయి. చిన్నన్నయ్య అప్పటికే బట్టలేసుకుని ఉన్నాడు. సుడి గాలిలా బయటికివచ్చి 'నేనిప్పుడే వస్తా' అంటూ వెళ్ళిపోయాడు. కాని పెద్ద న్నయ్య రెక్కపట్టుకుని బలంగా ఆపేశాడు.చిన్నన్నయ్య కళ్ళు ఎర్రబడి వున్నాయి. ముఖం ఉబ్బింది. కనురెప్పలు వాచివున్నాయి.

"కథ పడకపోతే ఆడదానిలా ఏడుస్తూ కూర్చుంటారా?"

"ఏడవటం అనేది ఆడవాళ్ళకి పరిమితం అని ఎక్కడా లేదు. నిరాశ ఎవరికయినా ఒకటే!" గంభీరంగా వచ్చింది సమాధానం. క్షణం సేపు చిన్నన్నయ్యని పరీక్షగా చూసిన పెద్దన్నయ్య "పోన్లే! కాఫీ తాగు" అన్నాడు.

"వద్దు, అవసరంలేదు."

"నాకోసం కాకపోయినా పోని మీవదినకోసమైనా తాగు"అన్నాడు. అప్పటికే వదిన గ్లాసుతో తెచ్చి అందిస్తూ "తాగు రామూ! తాగకపోయా వంటే నేను చచ్చిపోయినంత ఒట్టు" అంది. వదిన కళ్ళలో నీళ్ళు చింద టం మేం అందరం గమనించాం. చిన్నన్నయ్య ఏమనుకున్నాడో ఏమో కాఫీ తీసుకున్నాడు.

ఆ రాత్రి భోజనాల దగ్గర పెద్దన్నయ్య మళ్ళీ బీరువా సంగతి ఎత్తాడు "రాధ పేరుమీద ఇంతవరకూ కలిసి రాకపోవడం అనేది నే నెరుగను. ఇన్నాళ్ళనుంచి అత్తాకోడళ్ళిద్దరూ బీరువా, బీరువా అంటూ నా ప్రాణాలు తినేస్తున్నారుగా. రాధ పుణ్యమా అని దాని పేరుబలం వల్ల రూపాయితో సమస్య తీరిపోయింది" అన్నాడు.

అమ్మ నా వంక ప్రేమగా చూసింది. నేను అన్నం కెలుకుతూ కూర్చున్నా. నిజంగా నాకు సిగ్గేసింది.

"చెప్పురాధా! నీకేం కావాలి?" అన్నాడు పెద్దన్నయ్య.

"రాము ఎన్ని రోజులనుంచో గడియారం కావాలంటున్నాడు" వదిన గుర్తుచేసింది.

అన్నయ్య ఏదో అనబోయి ఆగి నవ్వుతూ "వాడికి కావాలంటే నా గడియారం వాడుకోమని ఎప్పుడో చెప్పాను. ఏరా చెప్పలా?" అన్నాడు.

చిన్నన్నయ్య సమాధానం చెప్పలేదు. వాడి వాలకం చూస్తే అసలీ సంభాషణ ఏదీ విన్నట్టులేదు.

"రామూ! అంతా అదృష్టవంతురాలని అంత పొగుడుతున్నారు. పోనీ ఈసారి రాధచేత్తో నీ కథ పంపించరాదూ?" అంది వదిన.

అందరం నవ్వుకున్నాం.

పై సంఘటన జరిగిన వారం రోజులకి వోరోజు చిన్నన్నయ్య నా దగ్గరకి వచ్చి "రాధా! ఓ అయిదు రూపాయలు వుంటే యివ్వు." అన్నాడు.

"ఎందుకు!" అప్పు ఇచ్చేటప్పుడు ఈ ప్రశ్న వేయాలని నాకు తెలుసు.

"కావాలి. పనుంది."

"నాకు చెప్పకూడదా?"

"కథ పోస్టు చెయ్యాలి" సీరియస్‌గా అన్నాడు.

నేను తలెత్తి అన్నయ్య వైపు చూశాను. "నిన్ను అంతా అంత అదృష్టవంతురాలివని ఆకాశానికి యెత్తేస్తున్నారుగా! చూస్తాను. నీ డబ్బుతో పోస్టుచేస్తే కథ పడుతుందని నా నమ్మకం"

నాకు ఒళ్ళు మండిపోయింది. కథ పడితే తనకి పేరు వస్తుంది. పడకపోతే నేను దురదృష్టవంతురాలిని అని రుజూ చేస్తాడు. ఎటు చూసినా తనకే లాభం! ఏం తెలివితేటలు! అయినాసరే అయిదు రూపాయలు నాకు ఇవ్వక తప్పలేదు. పై నుంచి నాకిది ఒక దండగ. మా చిన్నన్నయ్యకి డబ్బు తీసుకోవటం తప్ప తిరిగి ఇవ్వటం గుర్తుండదు. ముఖం మాడ్చుకుని, పెద్దన్నయ్య జాకెట్టు కుట్టించుకోమని ఇచ్చిన అయిదు రూపాయలు తెచ్చి వాడి చేతిలో పెట్టాను.

అన్నయ్య కథ పోస్టు చేశాడో లేదో కూడా నేను కనుక్కోలేదు. ఉద్యోగం కోసం అహర్నిశలూ ప్రయత్నం చేస్తున్న నాకు క్షణం తీరుబడిలేదు. చివరికి ఆడపిల్లల స్కూల్లో టీచర్‌గా దొరికింది. పిల్లలంటే

నాకిష్టం. కాకుండా బోలెడన్ని కలవలు. ఆ ఉద్యోగం నాకు వచ్చింది. సోమవారం నుంచి జాయినవాలి. ఈరోజు శనివారం రేపు ఒక్క రోజు ఖాళీ! ఇవాళ, రేపట్లో ప్లాస్టిక్ బ్యాగ్ పూర్తి చేయాలని పట్టుదలగా కూర్చున్నాను.

"పోస్టు!" వాకిట్లో కేక వినిపించింది.

నేను విని కూడా కూర్చున్న చోటునుంచి లేవలేదు. పోస్టుమాన్‌తో ఇంకనాకేం పని, నా ఉద్యోగం నాకు వచ్చేసింది. వదిన నిద్రపోతున్నట్టుంది. రాలేదు. చిన్నన్నయ్య ఒక్కడే వెళ్ళాడు. క్షణంసేపు ఆలోచించాను. కథ తిరిగి వచ్చివుంటుంది. బిగబట్టుకుని చేతిలో పార్శిల్‌తో చిన్నన్నయ్య రాకకోసం ఎదురు చూస్తున్నా.

"రాధా!" చిన్నన్నయ్య ఒకసారిగా కేకపెట్టాడు.

నేను వోయ్‌అనేలోపలే "రాధా – రాధా" అని విన్పించింది. ఆ కేకలకి ఇల్లంతా అదిరిపోయింది.

నేను ఆత్రంగా లేచివెళ్ళాను. అప్పటికే నిద్రలో ఉన్న వదినా, అమ్మా కూడా వచ్చారు.

"రాధా!" చిన్నన్నయ్య ఒక్కసారి అమాంతం నన్ను పైకెత్తి గిరగిరా తిప్పేశాడు.

"ఏమిటి! ఏమిటి?" నేలమీద కాళ్ళు ఆనగానే వూపిరి కోపం ఆయాసపడ్తూ అన్నాను.

"రాధా! నేను.... నేను...."

"ఏమిటయ్యా అది? ఏమిటా కాగితం? టెలిగ్రాంలా వుందే?" వదిన ముందుకువస్తూ అంది.

"వదినా! నిజంగా రాధ అదృష్టవంతురాలు. మన రాధ అదృష్టవంతురాలు. నా కథ పడింది. పడిందికాదు, ఫస్టు ప్రైజ్ వచ్చింది."

"ఆఁ!" ఒక్కసారిగా వదినా, నేనూ గుండెలమీద చేతులేసుకుని ఆశ్చర్యపోయాం.

"నువ్వు చెప్పేది నిజమేనట్రా?" అంది అమ్మ నమ్మలేనట్టు.

"నిజం అమ్మా! ఇదుగో చూడు టెలిగ్రాం." మధ్యలోనే వదిన తను లాక్కుని చూసింది. చిన్నన్నయ్య అమ్మ కాళ్ళకి పెనవేసుకుని.

"అమ్మా! ఇప్పటికి నీ కొడుకు ప్రయోజకుడైనాడు. వెధవా, శని- అని తిట్టగలవా నువ్వు?"

"ఇదేమిటి రామూ! టెలిగ్రాం రాధ పేరుమీద వుంది?" అంది వదిన.

"అవును వదినా! కథ రాధ పేరుమీద పంపించాను!" చిన్నన్నయ్య లేచి గాలిలో తేలిపోతున్నట్టు నా దగ్గరకు వచ్చి నా రెండు చేతులూ పట్టుకుని "రాధా! పేరు నాకు, డబ్బు నీకు. అందులో ఒక్కకానీ కూడా నా కవసరం లేదు" అన్నాడు.

నాకు నిజంగా మతిపోయింది. వదిన చేతిలో టెలిగ్రాం తీసుకుని చూశాను. నిజమే, టెలిగ్రాం నాకే యిచ్చారు. ఏం మాట్లాడాలో తోచని నేను తడబడుతూ "కానీ....అన్నయ్యా....నేను....నేను....ఇదెలా? ఇప్పుడే ఉత్తరం వ్రాసేస్తా" అన్నాను.

"వీల్లేదు. ఇప్పుడుకాదు. నవల పూర్తిగా పడనీ. తర్వాత"అన్నాడు. నిజంగా నేను రచయిత్రిని కాదు అన్న సంగతి ఆ పత్రికాధిపతులకి తెలియ పరచనేలేదు. మొదటి బహుమతి వచ్చింది కాబట్టి నా గురించి వివరాలు తెలుపమని, ఫోటో పంపమని వాళ్ళు అడిగారు. చిన్నన్నయ్య తనే స్వయంగా స్టూడియోకి తీసుకెళ్ళి ఫోటోతీయించి నా గురించి లేని పోని అబద్ధాలు కల్పించి, నాకు లేని ఆశయాలు వున్నాయని వ్రాస్తూ ఉత్తరం వ్రాశాడు.

ం ం ం ం

వారపత్రికలో సీరియల్ ప్రారంభమైంది. ఆ గొడవ ఏమిటో నాకు బొత్తిగా పట్టదు. చిన్నప్పటినుంచి అమ్మ 'ఆఁ, ఏదో గిలుకుకున్నాడులే' అంటే నాక్కూడా అదే అభిప్రాయం ఏర్పడిపోయింది. అసలు పుస్తకాలంటేనే నాకు తలనొప్పి. అంత శ్రద్ధగా గంటలతరబడి, కాళ్ళు రెండూ ముడుచుకుని కూర్చోవాలంటే విసుగు. పువ్వులు గుచ్చటం, తెరలు అల్లటం, కొత్త కొత్త పిండివంటలు నేర్చుకోవటం అంటే మహా సరదా నాకు. అన్నింటిని మించి సంగీతం అంటే ప్రాణం. పాట యే భాష అయినాసరే, చివరికి లంబాడీలది, చైనావాళ్ళది అయినాసరే, భావం అర్థం కాకపోయినా కూర్చుని వినగలను. దురదృష్టవశాత్తు మా

ఇంట్లో నా ఒక్కదానికి తప్ప సంగీతంమీద ధ్యాసకాని, ఆసక్తికాని యెవరికీలేదు. అందుకే నాలో దాన్ని నేర్చుకోవాలనే ఆశ అలా మొదట్లోనే ఎండి వాడిపోయింది. ఇప్పుడు నాకు దొరికిన ఉద్యోగం కూడా నాకు తగినది. పిల్లలతో చక్కటి కాలక్షేపం. తీరుబడి సమయాల్లో ఇల్లు చక్కదిద్దడం, దొడ్లో అమ్మ వేసిన బీర, కాకర మొదలయిన పాదులకి నీళ్ళు సరిగా అందుతున్నాయో లేదో చూడటం, తీగెలని సరిగ్గా పందిరి మీదికి ప్రాకించటం ఇలాంటి పనులతో నాకు తోచదన్న బాధే వుండదు. పుస్తకాలు చదివే తీరుబడి అసలే వుండదు. అందువల్లనే వారపత్రికలో వరసగా పడుతున్న సీరియల్ చదవలేదు. పేరు నాది పడినా దానిపై నాకెలాటి అధికారం లేదు కాబట్టి, అది కూడా నాకేమంత ఉత్సాహం అన్పించలేదు. కథ పడింది. చిన్నన్నయ్య దృష్టిలో కూడా నేను అదృష్టవంతురాలిని అయ్యాను. అక్కడివరకే ఆలోచించుకుని సంతృప్తిపడిన నేను, ఆ పత్రిక నుండి ఉత్తరాలు రావటంగాని, వాటికి చిన్నన్నయ్య నా పేరుతో సమాధానం ఇవ్వటంకానీ అవేమీ నాకు తెలియదు.

ఇంతమందిని ఇంత ఆకర్షిస్తున్న ఆ అద్భుతమైన కథ ఏమిటా అని ఓ ఆదివారం ఆ వారపత్రికలన్నీ ముందేసుకుని చాలా ఓపికగా చదివాను. అందులో ఇద్దరు అక్కచెల్లెళ్ళు ఒకతనిచేత మోసం చేయబడి జీవితంలో దెబ్బలు తింటారు. తర్వాత ఎలాగయితేనేం కోలుకుంటారు. అప్పటినుంచి వాళ్ళకి మగవాళ్ళంటే విపరీతమైన ద్వేషం. కావాలని అందర్నీ ఆకర్షించుకుని వాళ్ళ బలహీనతలు గ్రహించి నాశనం చేస్తుంటారు. అందులో వాళ్ళకి తరువాత, తరువాత జీవితంలో తారసిల్లే వాళ్ళంతా సత్య హరిశ్చంద్రులు, అపర శ్రీరామచంద్రులూ, వాళ్ళని చక్కదిద్దాలనే ఉదార స్వభావులు. కాని ఆ అక్కచెల్లెళ్ళిద్దరూ అదేం పట్టించుకోరు. వాళ్ళందరిలో కొంతమంది పిచ్చివాళ్ళవుతారు. ఇంకా కొంతమంది హత్యలుచేసి జైళ్ళకి వెళ్తారు. మరికొంతమంది వున్నదంతా వూడగొట్టుకుని బిచ్చం ఎత్తుకుంటారు. కొంతమంది ఆత్మహత్య చేసుకుని చచ్చిపోతారు. చివరికి అక్క చెల్లెళ్ళిద్దరూ ప్రతీకారం తీర్చుకున్నాం అనే గర్వంతో విర్రవీగుతారు.

ఈ కథలో బాగున్న అంశం ఏమిటో ఎంత ఆలోచించినా నా కర్థం కాలేదు. ఎవడో ఒకడు అన్యాయం చేస్తే ఆ వెధవని ఏం చెయ్యలేక మిగతా అమాయకులని అన్యాయం చేయటం ఏం ధర్మమో మరి! ఆ కథంతా జాగ్రత్తగా చూస్తే వాళ్ళిద్దరూ ఆడపిల్లలు కాదు. నరరూపం ఎత్తిన రాక్షసులు అన్పించింది.

అన్నయ్యకి వచ్చిన ఉత్తరాలు కూడా చదివాను. అందులో ఆడపిల్లలంతా బాగాలేదని, స్త్రీని భయంకరంగా చిత్రించటం దారుణం అని వాపోతూ వ్రాశారు. మగవాళ్ళు చాలామంది అద్భుతంగా వుందని మెచ్చుకుంటూ పొగడ్తలు గుప్పించారు.

అది బాగుందో లేదో నాకు తెలియదు. మొత్తానికి అందరిలో ఓ విధమైన సంచలనం తెప్పించింది. ఆ పత్రిక అమ్మకం పెరిగింది. పత్రికాధిపతి కృతజ్ఞతలు తెల్పుకుంటూ వెంటనే సాధ్యమైనంత త్వరలో ఇంకో నవల పంపించమని ఉత్తరం వ్రాశాడు. చిన్నన్నయ్య ఆనందం పట్ట శక్యం కాకుండా పోయింది. పాత కాగితాలన్నీ తీసి దుమ్ము దులపడం ప్రారంభించాడు. ఎవరి నోటవిన్నా అనూరాధ, అనూరాధ అంటూ నా పేరే విన్పిస్తోంది. చివరికి స్కూల్లోకూడా టీచర్లు నన్ను అదోమాదిరిగా చూడటం ప్రారంభించారు. ఒకచోట, రెండోచోట నే వెడుతుంటే వెనక నుంచి "ఈ అమ్మాయే ఆ ప్రతీకారం అని కథ వ్రాసింది" అని వేలు పెట్టి చూపించడం జరిగింది. నాకు అది కొంచెం ఇబ్బందిగా అన్పించసాగింది.

ఊళ్ళోవున్న వనితా మండలివాళ్ళు నాకు సన్మానం చేస్తామంటూ వచ్చారు. అదృష్టవశాత్తూ వాళ్ళు వచ్చేసరికి నేను ఇంట్లో లేను. మా చిన్నన్నయ్య వుండి వాళ్ళతో మాట్లాడి నా తరపున అంగీకారం తెలిపాడు

ఇంటికి రాగానే ఈ వార్త విని "అమ్మ బాబోయ్! చచ్చాను" అన్నాను.

"ఏం పర్వాలేదు రాధా! ఇలా కొద్దిరోజులు బాగా పేరు రానీ. ఆ తర్వాత నన్ను బయట పెట్టుదువుగాని. నా జీవితం ఇప్పుడు నీ చేతుల్లో వుంది. నన్ను నాశనం చేయకు" అన్నాడు దీనంగా.

"కానీ, నేనేం చెయ్యాలి? స్టేజీ అంటే నాకు చచ్చేంత భయం. అందులో అబద్ధపు మనిషిగా అంతమందిని మోసం చేస్తూ....నావల్లకాదు బాబూ!"

"నువ్వేం మోసం చేయటం లేదు. అట్టడుగున అవకాశం లేక పడి వున్న చిన్నన్నయ్య పైకి రావటానికి చేయూత నిస్తున్నావు-అంతే ప్లీజ్! కాదనకు."

ఇంకేమనను. నేను చెప్పాల్సిన ఉపన్యాసం చిన్నన్నయ్య ఇచ్చి నాచేత కంఠస్థంచేయించాడు. అమ్మని, వదినని కూర్చోపెట్టి ప్రేక్షకులుగా వూహించుకోమని నాచేత రిహార్సల్స్ చేయించాడు. ఆ ఉపన్యాసం అంతా నాకు సన్మానం చేసినందుకు కృతజ్ఞతగా రెండు మూడు వాక్యాలున్నాయి. మిగతా అంతా మా చిన్నన్నయ్యని గురించి పొగడ్తే! ఈ కథలు వ్రాయ టానికి యెంత యిన్స్పిరేషన్ యిచ్చాడో, ఎన్నివిధాల సాయంచేశాడో నా అభివృద్ధిని అందరికంటే ఎక్కువగా ఎంత అకాంక్షిస్తున్నాడో అదంతా వివరంగా వుంది. సన్మానం ఇంకో మూడురోజులుంది. ఎప్పుడూ కంటి నిండా కమ్మటి నిద్రపోయే నేను నిద్ర అంటే ఏమిటో మర్చిపోయాను. ఓ విధమైన భయం గుండెలమీద కూర్చుని నొక్కుతూ వుండేది.

ఎప్పుడా అని ఎదురుచూస్తున్న ఆ సమయం రానేవచ్చింది. పెద్ద న్నయ్య వూళ్ళోలేడు. వదినకి ఒంట్లో బాగాలేదు. అమ్మ యిలాంటి వాటికి రాదు. చిన్నన్నయ్య వెంటవస్తానని బయలుదేరి తీరా బట్టలు వేసుకున్న తర్వాత "రాధా! వద్దులేవే! నా స్థానంలో నువ్వు నిలబడి అవన్నీ అందు కోవడం నేను చూడలేను. ఒకవేళ నువ్వా ఉపన్యాసం ఏదయినా మర్చి పోతే అసలే భరించలేను. నేను రాను నువ్వెళ్ళు" అన్నాడు.

ఒక్కదాన్ని వెళ్ళక నాకు తప్పలేదు. భయంతో గుండెలు పీచు పీచు మంటున్నాయి. కథ డబ్బురాగానే చిన్నన్నయ్యకొని యిచ్చిన లేత గులాబీరంగు చీర కట్టుకుని దానికి సరిపోయే జాకెట్ వేసుకున్నాను. ఆ బట్టల్లో ఎంతో బాగున్నాను. కాని ఆ ఆనందం నిలవడంలేదు.

సభా వేదికమీద అడుగుపెట్టేముందుకూడా గబగబా చిన్నన్నయ్య నేర్పిన పాఠాన్నే వల్లెవేసుకుంటున్నాను. ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యంగా హైదరాబాదులో కథలు చదివేవాళ్ళు చాలా మంది వున్నట్టున్నారు.

వచ్చిన వాళ్ళందరితో హాలంతా నిండిపోయింది. నాకు వాళ్లెవరూ కనిపించడం లేదు. హాలు మొత్తం మీద మా అమ్మ, వదిన, చిన్నన్నయ్య మాత్రమే కనిపిస్తున్నారు. లేకపోతే ఉపన్యాసం మర్చిపోయే ప్రమాదం వుంది.

సభ ప్రారంభమయ్యే ముందు కార్యదర్శిని ఒకావిడ పెద్ద పూల మాలతెచ్చి నా మెడలో వేసింది. వెంటనే కరతాళ ధ్వనులతో హాలంతా మోగిపోయింది. నేను తలవంచి వినయంగా అందరికీ నమస్కరించి మెళ్ళోదండ తీసి టేబిల్ మీద పెట్టి నా స్థానంలోకి వెళ్ళి కూర్చున్నాను. ఇదంతా (చిన్నన్నయ్య చెప్పిందే) యిక్కడి వరకూ బాగానే వుంది. నా ప్రక్కన కూర్చున్న లావాటి అధ్యక్షురాలు లేచి మాట్లాడ్డం మొదలు పెట్టింది. బహుశా తీరుబడికాక ఆవిడ ఈకథ చదివి వుండదు. అందుకని దాన్ని గురించి ఏం మాట్లాడలేదు. ఇంతచిన్న వయసులో కథలు వ్రాయ గలిగిన నా అదృష్టాన్ని మెచ్చుకుంది. ముందు ముందు యింకా మంచి రచయిత్రిని కావాలని ఆశీర్వదించింది. తర్వాత ఉపన్యాసం అంతా ఆంధ్రదేశంలో స్త్రీ జనాభ్యుదయాన్ని గురించి, దానికి ప్రభుత్వం, సంఘం చేయవలసిన సహాయాన్ని గురించి ఏదేదో మాట్లాడింది. ఈవిడ ఉపన్యాసం ఎప్పుడు ముగుస్తుందా అని ఎదురు చూస్తున్నాను. అప్పుడే ఉపన్యాసంలో అక్కడక్కడా ఏదో మర్చిపోయినట్టుంది. ఆవులింత వస్తోంది. ఆపుకోవటం కష్టంగా వుంది. ఏం చెయ్యటానికి తోచక ప్రేక్షకులవైపు చూశాను. ఎవరెవరో చాలామంది వున్నారు. ముందు వరసలో నీటుగావున్న బట్టల్లో, చక్కటి క్రాఫ్‌తో ఒకతను కాలుమీద కాలు వేసుకుని కూర్చుని ఉపన్యాసం వింటున్నాడు. నా చూపులు అతని మీద అరసెకను కూడా నిలవలేదు. ఆ కాసేపట్లోనే అతని చూపులు నాతో కలిశాయి. వెనువెంటనే చూపులు తిప్పేసుకున్నాను. ఆ తర్వాత వెంట వెంట రెండుమూడుసార్లు మా ఇద్దరి చూపులూ కలుసుకున్నాయి. నేను కొంచెం సర్దుకుని కూర్చున్నాను. మళ్ళీ అవతలివైపు చూడలేదు.

అధ్యక్షురాలి ఉపన్యాసం ముగిసింది. అందరికీ అంత నచ్చినట్టు లేదు. చప్పట్లు చప్పగా విన్పించాయి. ఇక నా వంతు కాబోలు అనుకుంటున్నాను.

కాని ఇంతలో నాకు దండవేసిన కార్యదర్శి మైక్ దగ్గరికి వెళ్ళి నిలబడింది.

మళ్ళీ ఈవిడ ఎంత సేపో అనుకున్నాను విసుగ్గా.

ఆవిడ మాట్లాడటం మొదలు పెట్టింది. కంఠం కంచు గంటలా వుంది. చూస్తుండగానే హాలంతా నిశ్శబ్దమై పోయింది. అందరూ శ్రద్ధగా వింటున్నారు. ఆవిడ ఎత్తుకోవడమే పత్రికవాళ్ళని దుయ్యబట్టటం ప్రారంభించింది. అర్హతలేని వాళ్ళు బహుమతి నిర్ణేతలుగా కుర్చుంటే ఇలాంటి అస్పష్టమైన రచనలని ఆకాశానికి ఎత్తుతారంది. అందరూ తెల్లబోయారు. నేనుకూడా తెల్లబోయి ఆవిడవైపు చూశాను. ఆవిడ వేలుపెట్టి నా వైపు చూపిస్తూ—

"నిజంగా ఆవిడలో ఏ మాత్రమైనా వ్యక్తిత్వం వుంటే స్త్రీని గురించి అలాటిరచనలు చేసినందుకు సిగ్గుపడాలి. ఇలాటి రచయిత్రులు సంఘసంక్షేమానికి ముప్పుతెస్తారు. ఆవిడ చిత్రించినంత భయంకరంగా జుగుప్సాకరంగా ఒక్క ఆంధ్రదేశంలో కాదు, భారతావనిలోనే కాకుండా యావత్ ప్రపంచంలోనే యే ఆడవాళ్ళు వుండరు. మేం ఆవిడని ఇక్కడకు పిలిపించింది సన్మానించటానికి కాదు. ఆంధ్రదేశంలో వున్న అన్ని మహిళామండలుల తరపున ఈవిడని దయయుంచి ఇంకెప్పుడూ ఇలాటి రచనలని చేసి స్త్రీజాతి సిగ్గుతో చచ్చిపోయేలా చేయవద్దని ప్రార్థించటానికి" ఆవిడ ఇంకా యేదో అంటూనేవుంది. నా కాళ్ళు చల్లబడినాయి కళ్ళలో గిర్రున నీళ్ళు తిరిగినాయి. ఒక్కసారి లేచి దగ్గరకి వెళ్ళి ఆవిడని ప్రక్కకుతోసి, "సోదర సోదరీమణులారా! క్షమించాలి. నే నది వ్రాయలేదు. నేనసలు రచయిత్రినికాదు" అని అరవాలనిపించింది. కాని నాకు తెలియని శక్తి ఏదో నన్ను వారించింది.

ముందు వరసలో తెల్లటి బట్టల్లో కాలుమీద కాలువేసుకుని కూర్చున్న అతనుకూడా క్షణం తెల్లబోయినట్టున్నాడు. తర్వాత జేబులో సిగరెట్ పాకెట్ తీసి దాని పేపర్ మీద పెన్సిల్ తో యేదో వ్రాసి దూరంగా

ద్వారం దగ్గర నిలబడిన ఒక అమ్మాయిని పిలిచి అది చేతికిచ్చి యేదో చెప్పాడు. ఏం చేయాలో, ఏం చెప్పాలో తోచని నేను నా కళ్ళు మళ్ళిన పై పే చూస్తున్నాను. అక్కడ నాకు కన్పించిన దృశ్యం ఇది. ఆ అమ్మాయి అదితెచ్చి తారాజువ్వలా మాటల్తో భగ్గుమంటున్న కార్యదర్శికి అందించింది. క్షణం సేపు దాన్ని చూసిన ఆవిడ, అందులో ఏముందో ఏమో నాకు తెలియదు. ఉపన్యాసాన్ని ముగించింది. ముగించేముందు మొక్కుబడిగా నాకు కష్టం కలిగిస్తే క్షమించమని కోరింది.

నేనేం మాట్లాడలేదు. మాట్లాడమని ఎవరూ కోరలేదు. సభ ముగిసింది.

"ఇంతకీ ఆ నవలలో యేముందేమిటి? నేను చదవనేలేదు." అంది అధ్యక్షురాలు.

"నాకూ తెలియదు" అన్నాడు. అక్కడనుంచి ఎలా బయట పడాలో నాకే తెలియదు.

"రండి. నేను డ్రాప్ చేస్తాను!" అన్నాడా తెల్లబట్టలతను నా ప్రక్కగా నడుస్తూ. "వద్దు, వద్దు నేనే వెళ్ళిపోతాను." అన్నాను ఖంగారుగా.

"ఇంతకు ముందు మీరు రావటానికి పంపింది నా కారే! పర్వాలేదు రండి" అన్నాడతను దారితీస్తూ. నేను నిద్రలో నడుస్తున్నదానిలా అనుసరించాను.

ఎప్పుడెప్పుడు ఇంటికెళ్ళి చిన్నన్నయ్య ముఖంమీద కొట్టాలన్నంత కోపంగా వుంది నాకు.

"వీళ్ళిలా అవమానం చేస్తారని మేం ఎవరూ అనుకోలేదు!" అన్నాడతను.

"ఇందులో అవమానం యేముంది. వాళ్ళకి తోచింది వాళ్ళు చెప్పారు" అన్నాను. ఏదోటి మాట్లాడకపోతే మతిపోయేట్టుంది.

అతను నవ్విన శబ్దం విన్పించింది! "అయితేమీరు చాలా ధైర్యం కలవారన్న మాట" అన్నాడు.

నేను మాట్లాడలేదు. అతనుకూడా ప్రసంగం పెంచలేదు. కారు ఇంటి ముందుకు వచ్చి ఆగింది నేను దిగి అతన్ని ఆహ్వానించకపోయినా

తనంతట తానే లోపలికి వచ్చాడు. నా కసహ్యం వేసింది. వాకిట్లోనే యెదురైనాడు చిన్నన్నయ్య.

"రాధా! ఎలా జరిగింది?" ఆదుర్దాగా అడిగాడు.

"ఎలా జరిగిందా?" తీవ్రంగా సమాధానం చెప్పబోయి నా ప్రక్కన అపరిచిత వ్యక్తి వున్నాడని తెలుసుకుని నిగ్రహించుకున్నాను.

"ఏం? ఏమైంది?—అలా ఉన్నావేం?"

"నాకు తెలియదు" విసురుగా లోపలికి వెళ్ళిపోయాను. వెనకనుంచి "నే చెప్పాను" అని అతను అనడం విన్పించిది. చాలా సేపయింతర్వాత చిన్నన్నయ లోపలికి వచ్చాడు. వాడు లోపలికి వచ్చే అయిదు నిమిషాల ముందు కారు వెళ్ళిపోయిన శబ్దం విన్పించింది.

"రాధా!" అనునయంగా పిలిచాడు.

"ఏమిటి?" చీకట్లో పడుకునే అడిగాడు.

"క్షమించు."

"మధ్యలో నీ తప్పేముంది? అయినా ఆ అవమానం నాకెలా అవుతుంది. అనూరాధ రూపంలో చిన్నన్నయ్యది కాని, ఆ కథ నేను వ్రాస్తేగా నాకు బాధ."

"నీతో వచ్చిన అతనెవరో తెలుసా?"

"ఎవరు?"

"రాజశేఖరం అని. చాలా గొప్పవాడు."

"ఎందులో! కథలు వ్రాయడంలోనా?"

"కాదు, కాదు. చందాలివ్వటంలో—బీదవాళ్ళకి సాయం చేయటంలో! దిక్కులేని వాళ్ళకి వాళ్ళ అమ్మ పేరుమీద హాస్పిటల్ కట్టించాడు. తండ్రి పేరుమీద అనాధ ఆశ్రమం నిర్మించాడు."

"బాగా డబ్బుంది కాబోలు!" లైటువేస్తూ అన్నాను.

"ఆఁ! వాళ్ళ పెద్దవాళ్ళు ఇచ్చింది వుంది. అదికాకూడా ఇతను వ్యాపారంచేసి గడించిందికూడా చాలా వుంది."

"అదృష్టవంతుడు!" నిట్టూర్పు విడిచాను. మా పెద్దన్నయ్య ఎంత కష్టపడతాడు! కాని ఫలితం కాస్త. కొంతమందిని అదృష్టదేవత యెందుకనో అలా గుడ్డిగా వరిస్తుంది.

"రాధా!" చిన్నన్నయ్య వచ్చి మంచంమీద కూర్చున్నాడు.

"అతను పరిచయం కావటం మనకి చాలా లాభం తెలుసా-?"

"ఏం లాభం?"

"పెద్ద పెద్దవాళ్ళతో పరిచయం కల్గించుకోవచ్చు. వెళ్ళే ముందు అతనేమన్నాడో తెలుసా? నీకు వారంరోజులు తిరగకముందే వై.యమ్.సి.ఏ.లో ఘనంగా సన్మానం జరిగేలా చూడకపోతే తనపేరు రాజశేఖరమే కాదన్నాడు. నిన్న వాళ్ళు అలా అన్నారని దిగులుపడి బాధపడొద్దని మరీ మరీ చెప్పాడు."

"అదేమిటి? ఆ కథ నేను వ్రాయలేదనీ, ఆ బాధ నాకేం లేదనీ నువ్వు చెప్పలేదా?" అడిగాను.

"ఉహు! చెప్పలేదు!" తలాడించాడు.

క్షణంసేపు నా నోట్లోంచి మాట రాలేదు.

"రాధా! ఇప్పుడు ఈ అవమానం జరిగింది నీకుకాదు, నాకే అని తెలుస్తే అతనింత పట్టుదలగా మళ్ళీ నీకు సన్మానం చేయించాలని చూస్తాడా! ఆడపిల్లవి కాబట్టి నీ మీద అపారమైన సానుభూతి కలిగింది. ఇప్పటికి కానీ, తర్వాత—మరికాస్త పేరు వచ్చింతర్వాత బయటపెడ్దాం. రాధా! నా చెల్లాయివి కదూ. నన్ను నట్టేట్లో ముంచవుగా!"

"బాబూ! నా పేరు కావాలంటే నువ్వు వాడుకో. నా కభ్యంతరం లేదు. కానీ ఈ సన్మానాలకి—ఈ సానుభూతులకి ఓ పెద్ద నమస్కారం. నన్ను మాట్లాడించకు!" ఖచ్చితంగా చెప్పేశాను.

o o o

మర్నాడు పేపర్లనిండా ఈ వార్తలు వచ్చేశాయి. కొన్ని పేపర్లు వాళ్ళ ధైర్యాన్ని మెచ్చుకున్నాయి. ఇంకా కొన్ని ఇంత మర్యాదలేని తనాన్ని ఎక్కడా చూడలేదని విమర్శించాయి. మొత్తంమీద అందరినోళ్ళ లోను నా పేరే! ఇదోరకమైన పబ్లిసిటీ. ఇదీ ఒకందుకు మంచిదే అన్నాడు చిన్నన్నయ్య. స్కూల్లో మాత్రం నన్ను చూడగానే పయిట కొంగులు చాటు చేసుకుని నవ్వుతున్న తోటి టీచర్లని చూడగానే వళ్ళు మండి పోయింది.

నాకు వనితామండలివాళ్ళు చేసిన అవమానం విన్న పత్రికాధిపతి మండిపడుతూ సంపాదకీయం వ్రాశాడు. అతను వెల్లగక్కిన ఆగ్రహంలో నన్ను ఆకాశానికెత్తి, వనితామండలివాళ్ళని దుయ్యబట్టి, అదే సంపాదకీయంలో ఈ సీరియల్ అయిపోగానే వెంటనే నాదే మరో సీరియల్ ప్రచురిస్తున్నట్టు, అనూరాధలాటి ఉత్తమ రచయిత్రిని పాఠక సమూహానికి తమ పత్రిక ప్రప్రథమంగా పరిచయం చేస్తున్నందుకు గర్విస్తున్నామనీ వ్రాశాడు. ఇలాటి ఉత్త ఉత్త అరుపులకు రచయిత్రి బెదిరిపోకూడదని, స్త్రీ పురుషుల్లో ఎవరైనాసరే వాళ్ళ బలహీనతలు ఎత్తి చూపే హక్కు ప్రతి రచయిత్రికి వుందనీ ఏమిటేమిటో వ్రాశాడు.

ఇది యిలా వుండగా నేనా స్కూల్లో పనిచేస్తున్నానని ఎలా తెలిసిందో తెలియదు ? .నన్ను చూడటానికి రోజుకి కనీసం పందమంది అయినా స్కూలుకి రావటం ప్రారంభించారు. మొదట మొదట నాలాటి రచయిత్రి తమ స్కూల్లో పనిచేస్తున్నందుకు మా హెడ్మాస్టరు గర్వపడింది. ఆడంబరంగా అందరికీ పరిచయం చేసింది. కాని రాను రాను వచ్చేవాళ్ళ సంఖ్య అధికం కావటంతో నాకు తలనొప్పి, ఆవిడకి భరించలేనంత విసుగు కలగడం ప్రారంభించాయి.

చివరికి ఓ సుప్రభాతంలో నన్ను వాళ్ళ యింటికి పిలిపించి "నీలాటి ప్రేరు ప్రతిష్ఠలున్న వాళ్ళు యిలాంటి చిన్న ఉద్యోగం చేయటం గౌరవానికి చాలా దెబ్బ. రాజీనామా యివ్వు" అంది.

నాకు కళ్ళనీళ్ళు తిరిగినంత పనైంది.

చిన్నన్నయ్య గొడవలోపడి, అక్కడికి యిక్కడికి తిరగటంలో స్కూలు పాఠాలు నిర్లక్ష్యం జరిగిన మాట వాస్తవమే. కాని దానికోసం నేనెంత బాధపడుతున్నానో ఆ భగవంతుడికే తెలుసు. ఇంకెప్పుడూ అశ్రద్ధగా వుండనని ఆవిడని బ్రతిమాలుకున్నాను. ఆవిడ ఏమనుకుందో ఏమో, నన్ను కళ్ళజోడులోంచి నిశితంగా చూసి సరేఅంది. బ్రతుకు జీవుడా అని బైటపడ్డాను. కాకపోతే యింకా పదిరోజులకైనా నేను రచయిత్రినికాదు అని బైటపడుతుంది. ఈ గాలి దుమారం సద్దుమణుగుతుంది. అప్పుడు నాపాఠాలు నా పిల్లలు కాకపోతే నాకింకేం ప్రపంచంవుంటుంది! నాకు చెందని దానికోసం నాకున్నది పోగొట్టుకోవటం ఏం వివేకం!

"రేపే నీకు వై.ఎమ్.సి.ఏ.లో సన్మానం చేస్తారు. శేఖరంగారు ఫోన్ చేశారు" అన్నాడు చిన్నన్నయ్య.

నేను తలెత్తి చూశాను.

"రాధా! నీకు మంచి చీరె వుందా? మొన్న కట్టుకున్న ఆ గులాబి రంగుది వద్దు. బజారుకి పోదాం రా! ఇంకో చీరె ప్రత్యేకంగా కొను క్కుందువుగాని" అన్నాడు. చిన్నన్నయ్య ముఖం వెయ్యి వాట్లుల ఎల క్ట్రిక్ దీపంలా వెలిగిపోతోంది.

"చిన్నన్నయ్యా!"

గదిలోంచి వెళ్ళిపోతున్నవాడు ఆగి వెనక్కి తిరిగి చూశాడు.

"నేను ఆ సన్మాన సభకి రాను అని అప్పుడే చెప్పాను."

"అంటే?" దగ్గరగావస్తూ అడిగాడు.

"అంటే నాకిష్టంలేదు. అంతే-దానికి తిరుగులేదు. ఒకవేళ కాదు కూడదు అని బలవంతంగా పంపించావా, స్టేజీమీద నేను నీ రహస్యం బయట పెట్టేస్తాను."

స్థాణువులా నిలబడిపోయినాడు కొద్దిసేపయిన తర్వాత తెప్ప రిల్లాడు. నాతో ఒక్క మాటకూడా అనకుండా మౌనంగా బయటికి వెళ్ళాడు. వాడలా ఏమీ అనకుండా వెళ్ళటం చూసే నాకు నిజంగా ఆశ్చర్యం వేసింది. ఆ సాయంత్రం అల్లా ఏంజరగలేదు. ఆ రాత్రి నేను పిల్లలు పేపర్లు ముందేసుకుని దిద్దటానికి ఎర్రపెన్సిల్ కోసం వెతుక్కుంటుండగా పెద్దన్నయ్య రాధా అంటూ గదిలోకి వచ్చాడు.

"ఏమిటన్నయ్యా?" వెనక్కుతిరిగాను. పెద్దన్నయ్య వెనకే చిన్నన్నయ్య కూడా ఉన్నాడు. అమ్మ అప్పటికే నా గదిలోనే మంచం మీద పడుకోవటానికి దిండ్లు సరిచేసుకుంటోంది.

"ఏమిటమ్మా, మీ గొడవ?" అన్నాడు పెద్దన్నయ్య వచ్చి అమ్మ మంచంమీద కూర్చుంటూ.

"గొడవా? "గొడవేమిటి" ఆశ్చర్యంగా అడిగాను.

"రేపు సన్మానానికి వెళ్ళనంటున్నావటగా!"

"అదా!" నా ముఖంలోకి రక్తం పొంగింది. కోపంగా చిన్నన్నయ్య వైపు చూశాను. వాడిదేమీ వినట్టు, తనకసలు సంబంధం లేనట్టు క్రిందికి చూస్తున్నాడు.

"అవునన్నయ్యా! వెళ్ళనన్నాను."

"ఎందుకని?"

"పిల్లల పేపర్లున్నాయి-దిద్దుకోవాలి." కుంటిగా అన్నాను. ఆ సన్మానం పేరుచెప్తేనే నా గుండెలు దడ దడలాడుతున్నాయని ఒళ్ళంతా చెమటలు పోస్తున్నాయనీ, కాళ్ళు గడగడ వణుకుతున్నాయని వీళ్ళకెలా చెప్పటం?

"రాధా! పేపర్లు నేను దిద్దిపెడ్తాను!" ఆత్రంగా అన్నాడు చిన్నన్నయ్య.

"ఆ! అయినట్లే, నువ్వేసిన మార్కులు ఇచ్చిన పేపరు చూసుకుని పిల్లలంతా నాకు మతిపోయిందని వెంటనే వుద్యోగంలోంచి తీసెయ్యమని గోలచెయ్యకపోతే చూడు."

పెద్దన్నయ్య ముఖంలో నవ్వు తొంగిచూసింది. "పోన్లేమ్మా, ఎక్కువ సేపు వుండకపోతే మానె, ఓ పది నిముషాలుండి పనుందని వచ్చెయ్యి" అన్నాడు.

"లేకపోతే వొంట్లో బాగాలేదని సాకు చెప్పెయ్యొచ్చు" అన్నాడు చిన్నన్నయ్య.

"ఆ పని ఇప్పుడే చేస్తే?" అన్నాను.

చిన్నన్నయ్య ముఖం వాడిపోయింది. దీనంగా పెద్దన్నయ్య వైపు చూశాడు. ఆ చూపుకు మా పెద్దన్నయ్య కరిగిపోయాడని వేరేచెప్పనవసరం లేదు. ఫలితం నాకు చిన్న లెక్చరు. "చూడమ్మా! రాధా! ఇన్నాళ్ళకి వాడి కథలు బయటకు వస్తున్నాయి. అవి కేవలం నీపేరు బలంవల్లనే అని మా అందరికీ తెలుసుననుకో! కొద్దిరోజులు పోనీ! వాడి రచనలు ప్రజల్లో బాగా నాటుకుపోనీ! ఇప్పుడే తొందరపడి బయట పెట్టటం వాడి భవిష్యత్‌కి అంత మంచిది కాదేమోనని నాకూ అనిపిస్తోంది. పేరు ఎవరిదయినా రచనలు బాగుంటేగా అంత సంచలనం తెచ్చేది. నిజంగా వీడిలో ఆ అపూర్వమైన కళ వుంది. ఆ కళని ప్రోత్సాహించటానికి మనకు చాల

నయినా విధంగా మనం సహాయపడడం కర్తవ్యం కదమ్మా! వెళ్ళు. రేపు ఆ సన్మానానికి వెళ్ళాలి నువ్వు."

పెద్దన్నయ్య చిన్నన్నయ్యని చూస్తూ అన్నాడు. ఎందుకో తెలియదు కాని ఆ కళ్ళలో వాడిని అలా చూస్తూంటే లీలగా గర్వం కదులాడింది.

"ఈ కాస్తదానికి ఇంత గొడవ దేనికి రాధా! పోనీ వెళ్ళకూడదూ?" అంది అమ్మ. అమ్మకి ఈ మధ్య నామీదకంటే కూడా చిన్నన్నయ్య మీద ఆపేక్ష ఎక్కువై పోయింది. మొట్టమొదటి కథ డబ్బురాగానే తెచ్చి అమ్మచేతిలో పెట్టి "అమ్మా, ఇంక నన్ను అప్రయోజకుడని తిట్టకు. మనిషికి డబ్బు సంపాయించటం ఒక్కటే ప్రయోజకత్వంకాదు" అన్నాడు. అమ్మ వాడిని దగ్గరకు లాక్కుంది. వదిన కళ్ళనీళ్ళు తుడుచుకుని ముక్కు చీదింది. ఇలాంటి కథలు నాలుగయిదు వ్రాస్తే నా పెళ్ళి తేలికగా యేఅప్పూ లేకుండా చేసెయొచ్చునని చిన్నన్నయ్య అన్నాడు. అది అమ్మ మనసులో బాగా పడింది!

ఆరోజే వై.యమ్.సి.ఏ.లో నాకు సన్మానం. చిన్నన్నయ్య నాకు ప్రత్యేంగా లేత నీలం రంగుచీర తెచ్చాడు. దానికి మాచ్ అయ్యే జాకెట్ నా దగ్గరవుంది. ఆ బట్టలేసుకుని అమ్మకి నమస్కరిస్తున్న నన్ను (ఎప్పుడు కొత్తబట్టలేసుకున్నా ఇంట్లో అందరికీ నమస్కరించి ఆశీర్వచనాలు అందుకోవటం నాకు అలవాటు) చిన్నన్నయ్య "రాధా అచ్చు నీలి మేఘంలా వున్నావు కానీ ఈ రంగు ఫోటోలో అంత బాగా పడదేమో? ఇంకా కొంచెం ముదురు రంగు తేవాల్సింది" అన్నాడు.

"రాధా! ఇన్ని సంవత్సరాల నా జీవితంలో ఒక్కసారి కూడా నీకింత మంచి చీర కొనిపెట్టలేక పోయాను!" తన కాళ్ళకి నమస్కరిస్తుండగా పెద్దన్నయ్య లేవదీస్తూ అన్నాడు.

"అన్నయ్యా!" నాకు తెలియకుండానే నేను పెద్దన్నయ్య చేతుల్లో వాలిపోయాను.

"అభిమానాన్ని ఆదరాన్ని డబ్బుతో కొలుస్తున్నావా? చిన్నన్నయ్యకు నావల్ల ఒక ఉపకారం వుంది కాబట్టి నాకు లంచంగా కొని

పెట్టాడు. లేకపోతే కనీసం ఒక్క జాకెట్ గుడ్డయినా కొనడు. ఆ సంగతి నాకు తెలుసు" అన్నాను.

"నీ మొహం!" అంది అమ్మ.

పెద్దన్నయ్య, వదిన చిన్నన్నయ్యకి కోపం వస్తుందేమోనని కంగారుగా వాడివైపు చూశారు. కాని వాడు తియ్యగా నవ్వుతూ "రాధా! టైమయింది" అన్నాడు.

ఈ రోజు నాతోపాటు అన్నయ్యలిద్దరూ, వదినా కూడా వస్తున్నారు.

అన్నయ్యా, వదిన వెనక వున్నారు. నేను చిన్నన్నయ్య ముందు నడుస్తున్నాం. చిన్నన్నయ్య జేబులోంచి ఓ పొట్లాం తీసి "రాధా! ఇది ఏమిటో తెలుసా?" అన్నాడు. అందులో తెల్లటి పొడి వుంది.

"ఏమిటది?" అన్నాను.

"విషం. ఇందులో సగం తిన్నా ప్రాణం పది నిమిషాల్లో పోతుంది. నువ్వు స్టేజీమీద ఈ రహస్యం బయట పెట్టటం మొదలు పెట్టి పూర్తయే లోపల నేనీ ప్రపంచంలో వుండను."

తలెత్తి అన్నయ్య కళ్ళలోకి సూటిగా చూశాను. "బెదిరిస్తున్నావా?"

"లేదు. నాకు కొద్దిగా అవకాశం ఇవ్వమని ఇంకా కొన్నాళ్ళపాటు ఎంత కష్టమయినా నిన్ను ఓపిక పట్టమని ప్రార్థిస్తున్నాను. అదుగో, అన్నయ్యా, వదిన వస్తున్నారు!" పొట్లం చప్పున జేబులో దాచేసుకున్నాడు. ఆ రోజు నిజంగా స్టేజీమీద బయట పెట్టెయ్యాలని గట్టిగా నిశ్చయించుకున్నాను. కాని నా మనసులో ఈ రహస్యం నాడు ఎలా కని పెట్టాడో నాకే అంతుపట్టలేదు. చిన్నన్నయ్య చేతిలో ఆ పొట్లం చూసిం తర్వాత నా నిర్ణయం రూపులేకుండా ఎగిరిపోయింది.

మా కారు వచ్చి వై.యం.సి.ఏ. ఆవరణలో ఆగింది. అప్పటికే అక్కడ వరసగా నిగనిగలాడుతూ నిలబడిన కార్లని చూసేసరికి నా ప్రాణం ఎగిరిపోయింది. పెదవులు తడారిపోయాయి.

నా ప్రక్కనే కూర్చున్న చిన్నన్నయ్య చెయ్యి నొక్కి "భయపడకు" అన్నాడు మెల్లిగా.

మా కారు ఆగగానే ఆ రాజశేఖరం అన్న అతను, ఇంకో

నలుగురు కారు దగ్గరికి వచ్చారు. అతను నేను క్రిందటిసారి చూసిన దాని కంటే హుందాగా, నాకు గుర్తున్నదానికంటే పొడుగ్గా హుషారుగా ఉన్నాడు. చిన్నన్నయ్య పెద్దన్నయ్యని, వదినని పరిచయం చేశాడు.

పెద్దన్నయ్యతో అతను కరచాలనం చేస్తున్నప్పుడు నా కెందుకో ఇద్దరూ ఒకళ్ళని ఒకళ్ళు జాగ్రత్తగా పరిశీలించటం కన్పించింది. లోపలికి వెళ్ళాం. అప్పటికే హాలంతా కిటకిటలాడుతోంది. అన్నయ్యలిద్దరు, వదిన నా నుంచి విడిపోయి ముందు సీట్లలో వాళ్ళకోసం ప్రత్యేకించిన స్థానాలలో కూర్చున్నారు. నా అరచేతులు చెమటతో తడిసిపోయినాయి. అక్కడంత గాలివున్నా ఊపిరి ఆడనట్టు అన్పించింది. నాకు తెలియకుండానే ఒక్కసారి విరగబడి బిగ్గరగా నవ్వాలనిపించింది. కాని ఎలాగో విశ్వ ప్రయత్నం మీద శరీరంలో ప్రతి బిందువూ కూడదీసుకుని అలాంటిపని జరగకుండా నిగ్రహించుకున్నాను.

"రండి" అంటూ శేఖరం అనే అతను తీసుకెళ్ళి వేదికమీద వున్న కుర్చీలో కూర్చోపెట్టాడు. అక్కడున్న నలుగురిని పరిచయం చేశాడు. హోరుమంటున్న నా చెవులకి వాళ్ళేమంటున్నారో వివరంగా విన్పించలేదు. నమస్కారం చేసి కూర్చున్నాను. ఏవేవో క్లబ్‌ల తరఫున, ఎవరెవరి పేరులో చెబుతూ నాకు దండలు వేశారు. రాజశేఖరం సభికులకి నన్ను పరిచయం చేసి అధ్యక్షుడిని మాట్లాడమని కోరాడు. సుదీర్ఘంగా వున్న ఉపన్యాసంలో అసలు రచయిత అంటే ఏమిటి అని అర్థం చెబుతూ, రచనలు ఎలా వుండాలి అని వివరించారు. నా శైలి గురించి పొగిడాడు. సబ్జక్టు తీసుకునే విషయంలోమాత్రం కాస్త శ్రద్ధ తీసుకోమని మృదువుగా హెచ్చరించాడు. కొన్ని రచనలురచయిత తన తృప్తికోసం వ్రాసుకున్నా, కొన్ని మాత్రంతప్పకపాఠకులని దృష్టిలో పెట్టుకుని వ్రాయాలని చెప్పాడు. దాదాపు గంట చెప్పినా ఆయన ఉపన్యాసం యేం విసుగు అన్పించలేదు. అందరూ చెవులు అప్పగించి శ్రద్ధగా విన్నారు. చిన్నన్నయ్య అయితే రెప్పవాల్చకుండా మరీ మరీ విన్నాడు.

నన్ను మాట్లాడమని కోరారు. నేను క్షణంసేపు మా వాళ్ళవైపు చూశాను. వదిన ఫర్వాలేదు అన్నట్టు చూసింది. పెద్దన్నయ్య ప్రేమగా ధైర్యం ఇస్తున్నట్టు చిరునవ్వు నవ్వాడు.

చిన్నన్నయ్య అరచేతిలో చిన్న పొట్లాన్ని అటుఇటు తిప్పుతున్నాడు. నేను లేచి. వెళ్ళి ముక్తసరిగా మూడు ముక్కలు మాట్లాడాను. అందులో మొదటిది-ఇంత ఆదరానికి నేను అర్హురాలిని కాదేమో అన్పిస్తోంది అని. రెండు-యిలాటి సభలు, సమావేశాలు నాకిష్టంలేదు, సిగ్గు, భయం జాస్తీ అని, మూడు-కృతజ్ఞతలు తెలుపుకుంటూ చిన్న వాక్యం. ఇవి దాదాపు ఎవరో తరుముకొస్తున్నంత వేగంగాచెప్పివెళ్ళి నాకుర్చీలో కూర్చున్నాను.

ఎలాగైతేనేం సభ పూర్తయింది. మరుక్షణంలో నేను మా అన్నయ్యల మధ్య వున్నాను. ఎవరెవరో నన్ను చుట్టుముట్టారు. కొంతమంది నా సంతకాలు అడిగారు. "అలవాటులేదు" అని తిరస్కరించాను.

"అయ్యో! మరీ యింత చిన్నపిల్ల అనుకోలేదు" అన్నాడొక ముసలాయన.

"ఈ అమ్మాయిని చూస్తే అసలు మాటలు వచ్చినట్టే లేదే!" ఇంకొకరు అన్నారు.

రాజశేఖరం వాళ్ళందర్నీ పెద్దన్నయ్యకి పరిచయం చేశాడు. తను స్వయంగా "అనురాధలాటి చెల్లెలుండడం మీ అదృష్టం" అని అభినందించాడు.మా పెద్ద వదిన నాప్రక్కన నిలబడి నన్ను తనే పెంచి పెద్ద చేసినట్టు, నేను వాళ్ళింటికి వెలుగు అన్నట్టు మాట్లాడింది. నా కాక్షణంలో నిజంగా రచయిత్రి అయితే బాగుండుననిపించింది. పాపం చిన్నన్నయ్యని ఎవరూ అంతగా పలకరించలేదు. నాకు బలే జాలేసింది. రాజశేఖరం తనే స్వయంగా మమ్మల్ని యింటికి తీసుకువచ్చి దింపాడు. అన్నయ్యలిద్దరూ అతని అభిమానానికి, ఆదరణకి కృతజ్ఞతలు తెలుపుకున్నారు.

"ఉండండి. కాఫీ తీసుకువెద్దురుగాని" అంటూ వదిన లోపలికి పరుగెత్తింది.

"ఇప్పటికైనా భయం తీరిందా?" నాతో మొదటిసారి మాట్లాడుతూ నవ్వు ముఖంతో అడిగాడు. ఆ క్షణంలో అతని కళ్ళలోకి చూసినప్పుడు మా పెద్దన్నయ్య చూపే ప్రేమలాంటిదేదో కన్పించింది.

నేను సమాధానం ఏం చెప్పలేదు. నవ్వి వూరుకున్నాను.

"తెలుగువాణి ఎడిటర్ ఈరోజే నన్ను ఏదయినా సీరియల్ వుంటే వాళ్ళ పత్రికకి ఇప్పించమని అడిగాడు" అన్నాడు శేఖరం.

చిన్నన్నయ్య ముఖంలో కోటి కాంతులు వెలిగాయి. వెంటనే "ఉండండీ! కొంచెం కాపీ చెయాలి. నాలుగురోజుల్లో సరిచేసి పంపిస్తాను" అన్నాడు. అతను చిత్రంగా వాడివైపు చూశాడు. చిన్నన్నయ్య వెంటనే సర్దుకుంటూ "మా రాధ కథలన్నీ నేనే కాపీచేసి పెడ్తాను" అన్నాడు.

"ఐసీ! అయితే ఏదన్నా కావాలంటే ముందు మిమ్మల్ని అడిగితే తెలిసిపోతుందన్నమాట!" అన్నాడు.

"ఓ తప్పకుండా!" అన్నాడు.

నేను ముఖం తిప్పేసుకున్నాను. నా కెందుకో ఆ క్షణంలో రాజశేఖరాన్ని మేం అందరం మోసం చేస్తున్నామనిపించింది.

అంతలో వదిన కాఫీ తీసుకురావడంతో సంభాషణ ఆగిపోయింది. అతను వెళ్ళిపోబోయేముందు చేతులు జోడించి శలవు తీసుకుంటూ, నా వైపు చూసినప్పుడు మళ్ళీ సరిగ్గా అలాగే అన్పించింది. ఆ కళ్ళకి ఏదో ఆకర్షణ వుంది. సూటిగా గుండెలోకి చొచ్చుకుపోయి అదోలా అయిపోయేటట్లు చేసే చిత్రమైన చూపు అది.

ఆరాత్రి భోజనాల దగ్గర అన్నయ్యలిద్దరు, వదిన ఒక్క విషయం కూడా మర్చిపోకుండా అమ్మకి అంతా వర్ణించి చెప్పారు.

"మన రాధ పుణ్యమా అని యీరోజు చాలామంది పెద్దవాళ్ళతో పరిచయం కలిగింది" అన్నాడు పెద్దన్నయ్య తృప్తిగా.

"నాదేముంది! అంతా చిన్నన్నయ్య గొప్ప" అన్నాను.

"లేదు రాధా! లేదు. ఇందులో వ్యక్తిగతంగా నీ భాగం చాలా వుంది" అన్నాడు చిన్నన్నయ్య.

"అవును నిజమే! ఆంధ్రదేశంలో యెంతమంది రచయితలులేరు! అందరికి ఇలా ఘనంగా సన్మానం జరుగుతోందా!" అంది వదిన.

"నిజమే వదినా! ఈరోజుల్లో పలుకుబడి సాధించందిఏమీలేదు. ఈ రోజు జరిగిన ఈ సన్మానం వెనుక రాజశేఖరం వెన్నెముకలా నిలబడ్డాడని మనందరికీ తెలుస్తూనేవుంది. ఆరోజు వనితా మండలివాళ్ళు అలా మాట్లాడటం, అదే సమయంలో అతను అక్కడుండటం, అందులో రాధ ఆడపిల్లకావటం ఇవన్నీ అతన్ని యింతగా ఆడంబరంగా సన్మానం ఏర్పాటు చేసేలా పురిగొల్పినాయి."

ఆరాత్రి పడుకున్నాక నాకు చిన్నన్నయ్య అన్న ఈమాటలు పదే పదే గుర్తుకు రాసాగినాయి. నిజమే! నేను ఆడపిల్లని కాబట్టి అతనిలో ఇలాజాలి కల్గించింది. అదే చిన్నన్నయ్య అయితే అంత పట్టించుకునే వాడా! జరిగినదానికి బాధపడి, సానుభూతి తెలిపి తన దారిని తను వెళ్ళే వాడేమో! అసలు నేను కథనే వ్రాయలేదని, పుస్తకాల గురించే తెలియ దని అతనికి తెలిస్తే అప్పుడూ ఆసక్తి వుంటుందా? వుండదేమో? పోనీ, వుంటే నాకేం లేకపోతేనాకేం? కాని ఎంత నిర్లక్ష్యంగా వూరుకుందామను కున్నా రాజశేఖరం లాంటి వ్యక్తి అభిమానం సంపాదించుకోవటం అనేది చాలా అపురూపమైన విషయంగా కన్పించింది. ఒకసారి దాన్ని చవిచూసిన తర్వాత అది పోగొట్టుకుంటే ఇంకా నరకం అనిపిస్తుంది. చాలా సేపటివరకూ నిద్రపట్టలేదు ఎప్పటికో నిద్రపట్టింది. నేను దిద్ద వలసిన పేపర్లు అలాగే వున్నాయని, రేపు ఉదయం హెడ్మిస్ట్రెస్‌కి ఏం జవాబు చెప్పాలా అన్న సంగతి అలిసిపోయిన నాకు గుర్తురాలేదు.

"లాభంలేదమ్మాయి. నువ్వు మర్యాదగా రిజైన్‌చేస్తే ఏ గొడవా వుండదు. లేకపోతే నేను బలవంతంగా తీసెయ్యాల్సివస్తుంది!" మర్నాడు ఉదయం హెడ్మిస్ట్రెస్ ముఖం గంటుపెట్టుకుని రుసరుసలాడుతూఅంది.

"ఈ ఒక్కసారికి క్షమించండి. ఇంకెప్పుడు చెయ్యను" పైకి బ్రతిమలాడ్తున్నా ఆవిడ ఉద్దేశ్యం మారదని నాకు కచ్చితంగా తెలుస్తూనే వుంది.

"నీకెందుకమ్మా ఉద్యోగం! తమాషాగా ఆడుతూ, పాడుతూ చేయాలంటే ఇంకెక్కడయినా వెతుక్కో మా వల్లకాదు. నీకోసం కొంత మంది పిల్లల భవిష్యత్ నేను పాడుచేయను."

నేనెంత బ్రతిమలాడినా ఆవిడ వినలేదు. రెజిగ్నేషన్ తీసుకుని కాని నన్ను వదలలేదు.

ఉసూరుమంటూ స్కూలు ఆవరణ దాటి బయటికి వచ్చాను. ఏం చెయ్యటానికి తోచలేదు. ఇంటికి వెళ్ళటానికి మనస్కరించలేదు. చిన్న న్నయ్య మీద పట్టరానంత కోపం వచ్చింది. పరధ్యానసగా నడుస్తున్న నేను వెనుకనుంచి కారు బొంయ్ బొంయ్‌మంటూ మీదికి రావటంచూసి ప్రక్కకు తప్పుకోబోయి రోడ్డుమధ్యలోకి వచ్చాను. అటువైపునుంచి

యింకోకారు వస్తోంది. భయపడిన నేను కంగారుతో మొదటికారువైపు వచ్చేశాను. చీర కాలికి అడ్డుపడి బోర్లా పడిపోయాను. నల్లటి కారు నా మీదకి వచ్చేసింది. దెయ్యంలా, కెవ్వుమన్న నేను మరుక్షణంలో చచ్చి పోయాను (అని అనుకున్నాను)

o o o o

మళ్ళీ మెలకువ వచ్చేసరికి ఎక్కడున్నానో నాకే తెలియదు. ఎవరో మీదికి వంగి "అనూరాధా....అనూరాధా!" అని పిలుస్తున్నారు.

"పెద్దన్నయ్యా!" శూన్యం లోకి చెయ్యిజాచి తడుముకుంటూ అన్నాను.

పెద్దన్నయ్య చెయ్యి వచ్చి నా చేతిని పెనవేసుకుంది.

"నే నెక్కడున్నాను? నాకేమైంది? నేను చూడలేకపోతున్నాను. ఎందుచేత?" నా కళ్ళు పోయాయేమోనన్న వూహ నన్ను పిచ్చిదాన్ని చేసింది. దిండుమీదనుంచి లేవబోయాను.

"ఉష్! లేవకు. పడుకో! నీకేం కాలేదు. నుదుటిమీద దెబ్బ తగి లింది అంతే!"

"నా కళ్ళు పోలేదు కదూ?"

"భగవాన్!" అంటున్న ఆ కంఠం వణికింది. వెంటనే బలమైన చేయి ఒకటి నా భుజాల క్రిందికి వచ్చి "అలాటి మాటలు అనకు. ఇదుగో! ఈ బాండేజీ విప్పుతాను. కొంచెంసేపు చూడు." తల వెనుక వున్న కట్టువిప్పుతూ అంది ఆ కంఠం. ఇప్పటికే కొద్ది కొద్దిగా నాకు ఆ మాట్లాడేది పెద్దన్నయ్య కాదని తెలిసింది. మరి ఎవరు? చిన్నన్నయ్య అసలే కాదు. బాండేజీ విప్పటంతో నా కళ్ళు తెరిపిడి పడ్డాయి. కాని ఎడంకన్ను తెరవలేక పోయాను. చాలా బాధగా అన్పించింది. కుడి కన్ను మామూలుగానే వుంది. చేతో ఎడం కన్ను తడిమి చూసు కున్నాను. కన్ను బాగా వాచి వుంది. కనుబొమపైన గాయం వుంది.

క్షణంసేపు నా ఎదురుగా నిలబడిన అతనెవరో నాకు తెలియ లేదు.

"ఏం భయపడకు. నిన్ను చూసి నా కారు బ్రేక్ వేశాను కాబట్టి సరిపోయింది. లేకపోతే —" అతడు ఆగిపోయాడు. ఇంతలో ఫోన్

మోగింది. వెళ్ళి తీసుకుని "ఆ! అవునవును. నేనే! మీ సిస్టర్ నా కారు క్రింద పడింది. ఖంగారు పడకండి. పెద్ద దెబ్బలేం తగలలేదు. ఊ! ఊ! ఇప్పుడే మీ ఇంటికి కారు పంపి మీకు ఫోన్ చేశాను. మీరు సీటులో లేరని చెప్పారు. యస్.యస్. ఏం భయంలేదు. మాట్లాడుతోంది."

నేను ఒక్క కన్నుతో అతనివైపు చూస్తున్నాను. అతను ఫోన్ పెట్టేసి నా దగ్గరికి వచ్చాడు.

"బాండేజ్ కట్టెయ్యనా?"

"వద్దు, వద్దు. మా అన్నయ్యని, అమ్మని చూసింతర్వాత–" అన్నాను భయంగా.

పాంట్ జేబులో చేతులు పెట్టుకుని నా వైపు క్షణం సేపు పరిశీలనగా చూసిన అతను చిరునవ్వుతో, "మానవ హృదయాలని, వాటిల్లో ఈర్ష్యని, ద్వేషాన్ని, పట్టుదలని అంత బాగా చూపిస్తూ నువ్వా నవల ఎలా వ్రాశావో నా కిప్పటికీ ఆశ్చరంగానే వుంది" అన్నాడు.

"నేను వ్రాయలేదు. మా చిన్నన్నయ్య వ్రాశాడు." నాలిక చివర దాకా వచ్చింది. ఇంతలో తలుపు తెరుచుకుని అమ్మా వదిన చిన్నన్నయ్య రావటంతో ఆగిపోయాను. ఎంతో ఆదుర్దాగా వచ్చినవాళ్ళు పెద్ద మంచంమీద తెల్లటి దుప్పటిమీద పడుకుని రాజశేఖరంతో మాట్లాడున్న నన్ను చూసి కాస్త తేరుకున్నారు. అప్పటికీ అమ్మ కన్నీళ్ళు దాచుకోలేక పోయింది.

శేఖరం జరిగిందంతా క్లుప్తంగా చెప్పి డాక్టరేం భయంలేదన్నాడని అని, "ఇప్పుడే వస్తా" అంటూ గదిలోంచి వెళ్ళిపోయాడు. శేఖరం తిరిగి వచ్చే లోపలే పెద్దన్నయ్య వచ్చాడు. వస్తూనే మంచం దగ్గరికి వచ్చి కూర్చుని రెండు చేతులతో నా తలని దగ్గరకి తీసుకున్నాడు. శేఖరం వెంటే నౌకరు అందరికీ కాఫీ, హార్లిక్సు తెచ్చాడు.

"మీ వాళ్ళందర్నీ చూడటం అయిందిగా, బాండేజ్ ఇక కట్టెయ్యనా" అన్నాడు నవ్వుతూ.

నేను మా పెద్దన్నయ్య గుండెలకి కరచుకుపోతూ "అన్నయ్యా! వద్దు. రెండు కళ్ళూ మూసేస్తే నాకు భయం వేస్తుంది. ఇక కళ్ళు తిరిగి

రావేమో, మిమ్మలెవర్నీ చూడలేనేమో అన్పిస్తోంది. నాకు ఒక కంటికి బాండేజి చాలు" అన్నాను.

అన్నయ్య యిబ్బందిగా శేఖరంవైపు చూశాడు. అతను అటువైపు తిరిగివచ్చి మంచంమీద రెండో ప్రక్కన కూర్చుని ఒక కన్ను మీదకే బాండేజ్ వచ్చేట్టు కట్టాడు. అది పూర్తిచేసి లేచి నిలబడి నవ్వుతూ "ఈ అమ్మాయిని మీరంతా అప్యాయంగా, సున్నితంగా పెంచారు. ఇలా పెరిగిన అమ్మాయి అంత తీవ్రంగా, ఘాటుగా ఆ నవల వ్రాయటం వింత కదూ !" అన్నాడు.

పెద్దన్నయ్య నావైపు చూశాడు. చిన్నన్నయ్య ముఖం తిప్పేసు కున్నాడు. అమ్మా, వదినా మాట్లాడలేదు.

మరో గంట తర్వాత శేఖరం కారులోనే నేను యింటికి వచ్చేశాను. శేఖరం వెళ్ళబోయేముందు నా దగ్గరికి వచ్చి నవ్వుతూ, "ఈ యాక్సిడెంట్ మీద ఒక కథ వ్రాయకూడదూ?" అన్నాడు. నా ముఖం ఎర్రబడింది.

"తప్పకుండా వ్రాస్తుంది. మీకు అంకితం కూడా యిస్తుంది" అన్నాడు చిన్నన్నయ్య హుషారుగా.

క్షణంసేపు నావైపు చూసిన అతని చూపుల్లో మళ్ళీ లీలగా అదే ఆప్యాయత, సున్నితమైన తీయటిభావం ఒకటి కన్పించింది. అతను వెళ్ళి పోయాడు. నాకు మాటిమాటికీ అతని ముఖమే గుర్తురాసాగింది. "నా కళ్ళు పోతాయేమో!" అని నేను వాపోయినప్పుడు "భగవాన్!" అంటూ అతని కంఠం వణకడం కూడా పదే పదే జ్ఞాపకం వచ్చింది.

o o o o

శేఖరం డాక్టర్ నాకు ట్రీట్‌మెంట్ ఇస్తున్నాడు. ఆయన చెప్పినట్టు నేను బుద్ధిగా విని రెండో కంటికి కూడా కట్టు కట్టించుకుని విశ్రాంతిగా పడుకున్నట్టయితే వారం రోజుల్లో ఎడం కన్ను యథాస్థితికి వచ్చేది. కాని నా మొండి పట్టుదలకి శిక్షగా వారంలో తగ్గటానికి రెండు వారాలు తీసు కుంది.

ఈ రెండు వారాల్లో శేఖరం మా మాయింటికి దినం విడిచి దినం దాదాపుగా ఏదో ఒక సమయంలో వచ్చి వెడ్తూనే వున్నాడు. వచ్చినప్పు డల్లా వెంట పువ్వులో, పళ్ళో ఏవో ఒకటి వుంటూనే వుంటాయి.

"ఆంధ్రదేశంలో ఆడపిల్లకి అలా పరాయి మగవాడు పువ్వులు ఇవ్వటం ఆచారంకాదని అతనికి తెలియదూ! ఈ ఫారెన్ వెళ్ళొచ్చిన వాళ్ళతో ఇదే బాధ" అన్నాను విసుగ్గా.

"పెళ్ళికాని పిల్లకి పెళ్ళికాని అతను యివ్వొచ్చు. అభ్యంతరం లేదు" అన్నాడు చిన్నన్నయ్య.

అమ్మా, వదినా యిద్దరూ అదేదో పెద్ద జోక్‌లా విరగబడి నవ్వటం చూసి నాకు వొళ్ళు మండిపోయింది. రోషం కూడా వచ్చింది. ఆ సాయంత్రం శేఖరం వస్తే నేను మాట్లాడలేదు. కావాలనే చాలా ముభావంగా వున్నాను.

"అలా వున్నారేం?" అప్పుడప్పుడు నువ్వు అనే అతను మధ్య మధ్య మీరు అని గౌరవించటం ఎందుకో నాకు అర్థం అయేదికాదు. కాని మీరు కంటే నాకు నువ్వు అని పిలువటమే బాగుండేది.

"ఎలా వున్నాను?" అన్నాను.

"విసుగ్గా, నాలాంటి వాళ్ళని ఒక్క క్షణం కూడా భరించలేనట్టు."

"ఛీ! ఛీ! అదేంకాదు, ఈ మంచంమీద యిలా రోగిష్టిదానిలా పడుకోవటం విసుగ్గా వుంది. అంతకంటే ఏంలేదు."

నా ఖంగారు చూసి అతను నవ్వాడు. కాని తర్వాత ఎక్కువసేపు కూర్చోలేదు. వెళ్ళబోయేముందు ఆగి "మీకు యే పుస్తకాలు యిష్టం?" అన్నాడు.

"నాకా?" ఒక్క క్షణం ఆలోచించి "చందమామ" అన్నాను. అని వెంటనే నాలిక కొరుక్కున్నాను. నా రహస్యం బయటపడింది. అయిపోయింది.

క్షణం సేపు నా వైపు చురుగ్గా చూసిన అతను రెండడుగులు ముందుకువేసి మంచందగ్గరగా వచ్చి నిలబడి "మర్యాదపు సరిహద్దులని ప్రప్రథమంగా నువ్వే దాటుతున్నావు తెలుసా?" అన్నాడు గంభీరంగా.

"అంటే?" అన్నాను భయంగా చూస్తూ.

"అంటే-ఇది—"మరుక్షణంలో చేయి జాచి నా ముక్కుపట్టి సున్నితంగా అటూ యిటూ వూపి, "తెలిసిందా, నా దగ్గరెప్పుడయినా తమాషా చేస్తే వెంటనే యిలా శిక్షిస్తాను. జాగ్రత్త!" అని వెళ్ళిపోయాడు.

నా ముఖం అలా యెర్రబడడం, అతని స్పర్శతో నా శరీరం అంతా విద్యుత్ ప్రసరించినట్టు అవటం బహుశా అతను గమనించి వుండడు.

మర్నాడు డజనుకిపైగా పుస్తకాలు పంపించాడు. అవన్నీ చూసి చిన్నన్నయ్య భూమ్మీద నిలువలేనట్టు ఊగిపోయాడు."ఓహ్! ఈ పుస్తకాల కోసం నేనెన్ని రోజులనుంచి కలవరిస్తున్నానో తెలుసా? మైగాడ్! ఇవన్నీ స్టాల్స్‌లో దొరకటంలేదిప్పుడు. ఇవన్నీ చదివేదాకా నాకు నిద్రపట్టదు"అని క్షణం ఆగి, నావైపు చూసి, "రాధా! శేఖరం పరిచయం జాగ్రత్తగా కాపాడుకునే బాధ్యత నీది. అతనివల్ల మనకి చాలా వుపయోగాలున్నాయి" అన్నాడు.

"స్వార్థంకోసం స్నేహాలు చేయటం, ఉపయోగించుకోవటానికి, పరిచయాలు పెంచుకోవడం నీలాటివాళ్ళపని, నాకు చేతకాదు. నేను యీ రోజే అతనితో అసలు విషయం చెప్తాను" అన్నాను కోపంగా.

చిన్నన్నయ్య ముఖంలో నవ్వు ఎగిరిపోయింది. కత్తివాటువేసినా నెత్తురుచుక్కలేదు. కొద్దిసేపయిన తర్వాత "చెయ్యి. కాని మరు క్షణంలో చిన్నన్నయ్య అనేవాడు ఈ ప్రపంచంలో వుండడు. నేనిది తమాషాకి చెప్పటంలేదు. భగవంతుని సాక్షిగా అమ్మమీద, పెద్దన్నయ్యమీద ఒట్టు వేసుకుని మరీ చెబుతున్నాను" అని వెళ్ళిపోయాడు,

"భగవాన్! నేనేం చెయ్యాలి? ఎంతకాలం ఇలా అందర్నీ మోసం చేస్తూ బ్రతకాలి? అసలు మొట్టమొదటే నేనెందుకు బయట పెట్టలేదు?" నాకు ఏడుపు ముంచుకు వచ్చింది.

నాలుగు రోజుల తర్వాత శేఖరం క్లబ్ తరఫున పిక్నిక్‌కి వెడుతున్నారుట. నాకు కూడా ఆహ్వానం వచ్చింది. నేను వెళ్ళనన్నాను. అక్కడికి వెళ్ళినప్పటినుంచి వాళ్ళంతా పుస్తకాల గురించి మాట్లాడతారు. ప్రశ్నలు వేస్తారు. నేను దిక్కులు చూడాల్సి వస్తుంది. అందుకే సాధ్యమయినంత వరకూ తప్పించుకోవటం మంచిది. రాలేనని తెలియజేస్తూ వ్రాసి పంపిన చీటిని చూసి శేఖరం తనే స్వయంగా వచ్చాడు. పిక్నిక్‌కి తనకి తెలిసిన

ఫిలం డైరెక్టర్ ఒకతను వస్తున్నాట్ట. ఈ సందర్భంలో నన్ను అతనికి పరిచయం చేయాలని సంకల్పం. ఈ సంగతి వినగానే చిన్నన్నయ్య నన్ను "వెళ్ళు-వెళ్ళు" అని వూదర పెట్టాడు.

"పోనీ, వెళ్ళు రాధా!" అన్నాడు పెద్దన్నయ్య.

"కాస నువ్వు వెళ్తే రాముకి మంచి అవకాశం వస్తుంది. ఈ మాత్రానికే ఇంత సాగదీయించుకోవాలా!" అంది వదిన నిష్ఠూరంగా.

"వెళ్ళరాదుటే?" అంది అమ్మ కూడా.

"అమ్మా! నువ్వు కూడా వెళ్ళమంటున్నావా? పరాయి మగవాడితో మాట్లాడితే కాళ్ళు విరక్కొడ్తాననే నువ్వు—" ఎవర్నీ ఏమి అనలేక అమ్మ మీద విరుచుకుపడ్డాను.

"అతను పరాయివాడు ఎలా అవుతాడు రాధా?" పెద్దన్నయ్య మందలించటం చూసి నాకు ఆశ్చర్యం వేసింది.

"ఇదేమన్నా కలిసివస్తే - ఇంతకంటె అదృష్టం ఇంకేమిటి వుంటుంది?" అమ్మ తనలో తను అనుకొన్నట్టు అంది.

"రాధా! ఇందులో కేవలం నా లాభం లేదు. కాస్త నీకూ కూడా వుంది, అది మర్చిపోకు" అన్నాడు చిన్నన్నయ్య.

వాళ్ళ అభిప్రాయం ఏమిటో చూచాయగా అర్థం చేసుకున్న నేను కళ్ళప్పగించి చూస్తుండి పోయాను.

నాకు ఇష్టంలేకపోయినా పిక్నిక్ వెళ్ళక తప్పలేదు. శేఖరం నాకు ఆ డైరెక్టర్ని పరిచయం చేశాడు. ఆయన ఒంట్లో బాగాలేక ప్రస్తుతం విశ్రాంతి తీసుకుంటున్నాట్ట. ఈ విశ్రాంతి సమయంలోనే కథలకోసం వెతుకుతున్నానని చెప్పాడు. నా దగ్గర ప్రచురింపబడని రెండు మూడు కథలుంటే తనకి పంపిస్తే చూస్తానని చెప్పాడు.

ఇంటికి వచ్చే ముందు దోవలో శేఖరం "ఇతను కనుక నీ కథ యేదయినా సినిమాకి తీసుకుంటే నువ్వు చాలా అదృష్టవంతురాలివి రాధా!" అన్నాడు.

నా కతని మాటలేవీ విన్పించటంలేదు. విన్పించినా అర్థం తెలియటం లేదు. నాకు గుర్తున్నదల్లా అతని ప్రక్కగా ఒంటరిగా కూర్చున్నాను అన్నది ఒక్కటే! మనసంతా మాటిమాటికీ అమ్మావాళ్ళు వెలువరించిన

అభిప్రాయంతో నిండిపోయింది. కానీ....కానీ ఇది సంభవమా? కాదు. ఎప్పటికీకాదు. నేను రచయిత్రిని కాదు అని తెలిసిన మరుక్షణంలో అతను నా ముఖంకూడా చూడడు. అది వాళ్ళు గ్రహించటంలేదు.

నిటారుగా, నిశ్శబ్దంగా, చలనంలేకుండా కూర్చున్న నన్ను అతను తల తిప్పిచూస్తూ "అలా వున్నావేం?" అన్నాడు.

"ఏంలేదు!" నీరసంగా వచ్చింది జవాబు.

అతను చేయిజాపి నా చేతిని తన చేతుల్లోకి తీసుకుని నొక్కుతూ "ఒక్కోసారి నువ్వంత బాగా వ్రాయగల మంచి రచయిత్రి అని గుర్తొస్తే నాకు ఆశ్చర్యం వేస్తుంది. నీ మనసుకి, రూపానికి సంబంధమే లేదు. పైకి ఇలా కూర్చున్న నిన్ను చూస్తూంటే-ఎంత అమాయకురాలు! ఎంత నాజూకుగా వుంది! ఎవరయినా వెనుకవుండి జాగ్రత్తగా కాపాడకపోతే ప్రపంచంలో వున్న ఈ మోసానికి కృత్రిమానికి పడిలి వాడిపోతుంది అన్పిస్తుంది. కానీ నీ నవలలు చదువుతుంటే...." అనసాగాడు.

"మీరింకేదయినా చెప్పండి."

"ఏం చెప్పను? మామూలుగా అందరిలాటి అందమైన చాలా సాధారణమైన అమ్మాయి అయితే వేరే మాటలు మాట్లాడేవాడిని. ప్రేమ పాఠాలు నేర్పేవాడిని."

అతను పలికే ఆ తీరులోనే ఓ విధమైన ఆకర్షణ వుంది. నేను మెల్లగా అతని చేతిలోంచి నా చేతిని విడిపించుకున్నాను.

"అదుగో! చూశావా, నీకు కోపం వచ్చేసింది!" అన్నాడతను నవ్వుతూ.

ఇద్దరి మధ్యా మౌనం ఆవరించింది.

కొద్దిసేపయింతర్వాత అతను "నీకు రచయిత్రిగా మంచిభవిష్యత్ వుంది. దానికి నాకు చాతనయినంతవరకూ అవకాశాలు కల్పించి, గట్టి పునాదులు వేయాలని తాపత్రయం. ముందు ముందు జీవితంలో నాకంటే ఆప్యాయత చూపించేవాళ్ళు, ఇంకా గొప్పగొప్ప అవకాశాలు కల్పించేవాళ్ళు నీకు చాలామంది దొరుకుతారు. చిన్నదానివి. ఎవరయినా నీకు సహాయం చేయటానికి చాలా వుత్సాహపడతారు. అప్పుడు నేను నీకు వాళ్ళలో

ఒకడిగాతప్ప ప్రత్యేకంగా యేంగుర్తుండను. కాని అనూ—"అతను క్షణం సేపు ఆగిపోయి "నిన్ను అనూ అని పిలువవచ్చునా?" అన్నాడు.

నేను అంగీకారం తెలుపుతూ తలాడించాను. అప్పటికే నా కళ్ళ నిండా నీళ్ళున్నాయని, నా మనసులో రహస్యం బయటపెట్టటానికి పెనుగులాడ్తున్నానని అతనికి తెలియదు.

"ఇంకెవరయినా ఆ పేరుతో పిలుస్తారా?" పిలువరు అన్నట్లు తల అడ్డంగా తిప్పాను. నేను మాట్లాడకపోవడం చూసి అతను ప్రక్కకు తిరిగి చూశాడు. చూసీ చూడగానే కారు బ్రేక్‌వేసి ఆపేశాడు.

"అలా వున్నావేం?"

చాలా సేపటినుంచి ఆపుకుంటున్న దుఃఖం ఉప్పెనలా పొంగింది.

"అరె! ఏమిటిది? ఎందుకు?" నా చేతిని తన చేతుల్లోకి తీసుకుంటూ ఆదుర్దాగా అడిగాడు.

నేను జవాబు చెప్పలేదు.

"ఎందుకెందుకు? నేనేమైనా బాధపెట్టే మాట అన్నానా?"

చీరకొంగు తీసి కళ్ళు తుడుచుకుని అందులోకి చీదుతున్న నాకు తన జేబురుమాలు తీసి యిచ్చాడు.

"నువ్వు కారణం చెప్పకపోతే నాకు చాలా బాధేస్తుంది తెలుసా?" అతని మాటలు చాలా మృదువుగా వున్నమాటనిజమే! కాని నన్నెందుకు దగ్గరికి తీసుకోడు? ఇంత అప్యాయత, అనురాగంచూపే అతను దగ్గరకు లాక్కుని 'కారణంచెప్పు. చెప్తేకాని వీల్లేదు' అని ఎందుకు ఆజ్ఞాపించడు? అతను అలాటిదేం చెయ్యలేదు. మెల్లగా చేతిని వదిలేశాడు. కొద్దిసేపయింది. ఏడుపును నిగ్రహించుకున్నాను నేను.

"ఇక వెళ్దామా?" అన్నాడు కారు స్టార్టుచేస్తూ.

"వద్దు, ఇంకా కొంచెం సేపు ఇక్కడే వుందాం" అనాలనిపించినా అనలేకపోయాను.

తర్వాత ఇద్దరిలో ఎవరం మాట్లాడలేదు. ఇంటికివచ్చి కారు ఆగగానే నేను దిగి, అతను కూడా దిగుతాడని చూశాను. కాని అతనలాటి ప్రయత్నం ఏం చేయకుండా "వస్తాను" అన్నాడు, కారుతిప్పుకుంటూ. నేను చూస్తుండగానే కారు వెళ్ళిపోయింది. ఏమైంది? నేనేం చేశాను?

ఎంత వెతికినా నాకు కారణం ఏమీ కన్పించలేదు.

తర్వాత వారంరోజులు వరసగా అతను కన్పించలేదు. కథల కోసం డైరెక్టరు వస్తాడని వేయికళ్ళతో ఎదురు చూసి ఆశాభంగం పొందిన చిన్నన్నయ్య "ఏమైంది? శేఖరంతో నువ్వేం చెప్పావు? నిజం చెప్పు" అంటూ నామీద ఎగిరాడు.

"దానికేం తెలుస్తుంది? దాన్నంటావేం?" పెద్దన్నయ్య కేకవేశాడు.

పదిరోజులు గడిచిం తర్వాత శేఖరం, డైరెక్టర్ కలిసి మా ఇంటికి వచ్చారు. చిన్నన్నయ్య నీట్‌గా వ్రాసి రెడీగా పెట్టిన నాలుగు కథలు ఇచ్చాడు.

మరో వారంరోజులకి అందులో రెండు కథలకి నాపేరుమీద ఎగ్రిమెంట్ అయిపోయింది. ఆ నెలాఖరులోనే నా కథ ఒకటి పిక్చర్ తీస్తున్నట్టు పేపర్లు అన్నింటిలోనూ వచ్చేసింది. మొట్టమొదట బహుమతి ఇచ్చి సీరియల్ ప్రచురించిన అతను ఇంకో నవల పంపమని పదే పదే ఉత్తరాలు వ్రాస్తున్నాడు. అదీగాకుండా వేరే చిన్నచిన్న పత్రికలవాళ్ళు కూడా నా అడ్రస్ వెతుక్కుంటూ వచ్చి కథలు యిమ్మని అడుగుతున్నారు.

శేఖరం ద్వారానే ఒకతను వచ్చి నాటకం వ్రాసి యిమ్మని అడిగాడు. చేయిపెట్టిన ప్రతిదాంట్లోనూ విజయదేవత చిరునవ్వు నవ్వటం చూసి చిన్నన్నయ్యకి మంచి ఉద్రేకం, పట్టుదల వచ్చింది. వ్రాయటంలో భాషమీద అధికారం, పటుత్వం కూడా అబ్బినాయి.

వాళ్ళు కోరిన పదిహేను రోజుల్లో "అమృత హృదయాలు" నాటకం వ్రాసి ఇచ్చాడు! కీర్తిప్రతిష్టలువస్తే వూరికేరావు. ఆడంబరంగా అన్నీ వెంటపెట్టుకుని వస్తాయి అన్నమాట రుజువైంది. ఎక్కడ కన్నా నా పేరే! ఎవరినోట విన్నా ఈ కథల గురించి చర్చలే! ఇక ఉత్తరాల సంగతి తెలుపనవసరంలేదు. కొంతమంది ఫోటోలు పంపమని అడిగేవారు. మరి కొంతమంది చూడటానికి వస్తాం, ఎప్పుడు ఖాళీగావుంటుందో చెప్పమని కోరేవాళ్ళు! ఇదంతా నా పాలిటి వో గాలిదుమారంలా తయారైంది.

వీటన్నిటి మధ్యా శేఖరం అప్పుడప్పుడు అలా కన్పించి నాకు

ఉపయోగపడే పనేదోచేసి మాయమవుతున్నాడు. అతను మాట్లాడుతున్నా, దగ్గర కూర్చున్నా యిదివరకటి చనువు పోయింది. ఇంతక్రితం ఆప్యాయత కన్పించే ఆ కళ్ళలో ఇప్పుడు గౌరవం తప్ప ఇంకేం కన్పించటం లేదు. నాకెందుకో ఇది చాలా బాధగా అన్పించసాగింది. మా ఇంట్లో యిదివరకులేని చాలాసామాను వచ్చింది. పుస్తకాలు వాటికోసం బీరువాలు ఏర్పడినాయి. సోఫా సెట్ కొన్నాం. ఇల్లంతా ఆడంబరంగా వుంది. కాని వాటిమధ్య తిరుగుతున్న నా మనసే పూర్తిగా శూన్యమైపోయింది. ఇంట్లో ఎప్పుడు చూసినా ఏదో హడావిడి. దేనికో దానికి పరుగులు. ఇదివరకులా ఇష్టం వచ్చినప్పుడల్లా సినిమాలకి, సంగీత కచ్చేరీలకి వెళ్ళటానికి వీలుపడటంలేదు. నాకు నేనే అవసరం పెరిగినప్పుడు అధికంగా వస్తువులు ఉత్పత్తిచేసే యంత్రంలా గిరగిరా తిరుగుతూన్నట్టు అన్పించాను.

ఆరోజు సాయంత్రం నేనువంటరిగా ఇంటి దగ్గరున్నాను. అమ్మా, వదిన బజారుకి బట్టలేవో కొనుక్కోటానికి వెళ్ళారు. పెద్దన్నయ్య అమృత హృదయాలు నాటకం రిహార్సల్స్ చూడటానికి వెళ్ళాడు. ఊరికే కూర్చున్న నేను ఏం తోచక పెద్దన్నయ్య దిండు కవరుమీద పూలు కుడ్తున్నాను.

ఇంతలో బయట అడుగుల చప్పుడు విన్పించింది. నేను తలెత్తి ఎవరా అని చూడబోయేలోపలే శేఖరం లోపలికి వచ్చాడు. అతను ఈ మధ్య కన్పించి పదిహేను రోజులకి పైగా అయింది. అతన్ని చూడగానే నా గుండెలెందుకో చిత్రంగా కొట్టుకుంటాయి. కారణం నాకే తెలియదు.

అతను వస్తూనే చేతిలో వారపత్రిక నా ముందున్న టీపాయ్‌మీద పడేసి "మీకు నాలుగు కాలాలపాటు మంచిగా పేరు వుంచుకోవడం ఇష్టం లేదా?" అన్నాడు.

"అంటే?"

"నేను నోరుతెరచి చెప్పాలా? నేనేదో ఆ రోజు తమాషాకి 'ఈ యాక్సిడెంట్‌మీద కథ వ్రాయకూడదూ!' అంటే అది పట్టుకుని కథ వ్రాసేస్తారా? పైనుంచి చివర 'రాజాకి అంకితం' అనా? ఇప్పటికే అందరూ నేనేదో మిమ్మల్ని ఆకాశానికి యెత్తి, లేని అర్హతని చూపిస్తు

న్నానని ఏడుస్తున్నారు. దానికి మీరు చక్కగా బుజువుకూడా చూపు తున్నారు. ఇది బాగా లేదు. రైటరుగా పైకి రావాలనుకున్నవాళ్ళు చేసే పనికాదు యిది!" అన్నాడు. అతని కంఠంలో కోపం తొంగిచూస్తోంది. పత్రిక తీసుకుని చూశాను, కథ పేరు 'ప్రమాదం' చివర అంకితం 'రాజాకి' అని వుంది.

"పైనుంచి ఆ హీరోని అచ్చు నాలాగే వర్ణించారు. ఈకథ చదివిం తర్వాత మనిద్దరినీ తెలిసిన వాళ్ళంతా ఏమనుకుంటారో అనే జ్ఞానం కొద్దిగా కూడా ఎందుకు లేకపోయింది?" ఎర్రబడిన అతని ముఖంలో కోపంకంటే బాధ ఎక్కువ కనిపించింది. "మీరీ కథ వ్రాసి నన్ను బాగా దూరం చేశారు. ఇప్పుడు నేను చేయాలనుకున్నా మీకేం సహాయం చేయ లేను. నా కాళ్ళు చేతులు కట్టేశారు. ఇంతకంటే సూటిగా నాతోనే మీ సహాయం నాకు అవసరం లేదని చెప్పేస్తే సరిపోయేది."

"కాని...." మాటలకోసం తడుముకుంటున్నాను నేను.

అతను మాట్లాడలేదు. సంభాషణ ఎలా మార్చాలో నాకు అర్థం కాలేదు. తప్పుచేసినదానిలా కూర్చుండిపోయాను.

"ఇలాటి పిచ్చిపనులు ఇంకెప్పుడూ చేయకండి. మీభవిష్యత్ చేతు లారా మీరే పాడుచేసుకున్న వారవుతారు. నే వస్తాను." అతను లేచి నిల బడ్డాడు. బొమ్మలా నేను కూడా లేచి నిలబడ్డాను.

"సాధ్యమయినంతవరకూ మన పరిచయం తగ్గించుకుంటేమంచిది. లేని గొడవలు భరించడం నాకిష్టం లేదు. అనవసరంగా అపవాదులు పడటానికి తెలివితక్కువవాళ్ళు కూడా ఇష్టపడరు. వస్తాను."

గుమ్మంవరకూ వెడుతూ అతనీ మాటలు అన్నాడు. నిద్రలో లేచి నడుస్తున్న దానిలా నేనుకూడా అతని వెనకే వెళ్ళాను. గుమ్మందాటబో తున్న అతను ఎందుకో వెనక్కుతిరిగి "కాని...." అంటూ ఏదో చెప్ప బోయి చటుక్కున ఆగిపోయాడు. బహుశా వాడిపోయి ఎలాగో అయి పోయిన నా ముఖం చూసి కావచ్చు.

"రాధా!" అప్రయత్నంగా అన్నాడు. మరుక్షణంలో నేను వెక్కి వెక్కి ఏడుస్తూ అతని చేతులమధ్య వున్నాను.

"ఏమిటిది? ఎందుకు?" సముదాయిస్తూ అడిగాడు.

నా కా క్షణంలో అచ్చు మా పెద్దన్నయ్య చేతిలో వున్నట్టేవుంది.

"చూడు. అందుకే నేను రావటానికి రెండురోజులనుంచి తట వటాయించాను. కాని చెప్పలేకపోతే మంచిదికాదని వచ్చాను. రచ యిత్రిగా నీ మనసులో అనేక భావాలుండవచ్చు. అవన్నీ బయట పెడ్తారా? ఆ కథ చదువుతుంటే నిజంగా నేను సిగ్గుపడ్డాను. నిత్య జీవి తంలో పరిసరాల నుంచి వ్యక్తులనుంచి సంఘటనలు తీసుకోవాల్సిందే. కాదనను, కాని ఆ వ్రాసేటప్పుడు ఆ వ్యక్తులని బయటపెట్టకూడదు. అది చదవగానే పాఠకులకి ఫలానా అని తెలిసిపోకూడదు. అలా తెలిసి పోతే మంచి రచయిత అన్పించుకోలేరు - తెలుసా!" భుజం తట్టూ అన్నాడు.

"నేను-నేను రాయలేదు." అసలు సంగతంతా చెప్పబోతున్నాను. కాని అతను నన్ను మధ్యలోనే ఆపేస్తూ "నువ్వు వ్రాయకపోతే పత్రిక వాళ్ళు కల్పించి అచ్చువేశారంటావా? అలా అనకు. మంచి అయినా, చెడు అయినా చేసిన తర్వాత ధైర్యంగా ఎదుర్కోవాలి. రచయితల్లో చాలామంది ఆలోచనలకి, ప్రవర్తనకి సంబంధం లేకుండా మాట్లాడడం నాకు తెలుసు. నువ్వు అలా కాకూడదు. రచయిత్రిగా ఎంత మంచిపేరు తెచ్చుకుంటున్నావో వ్యక్తిగా కూడా అంత బాగా పేరు సంపాయించు కోవాలి. నీ ఆలోచనలు, ఆశయాలు కథలవరకే పరిమితం కాకూడదు. అవి నీకూ్కడా వర్తించాలి."

భగవాన్! భగవాన్! అతని చేతుల్లో నా ప్రాణం అలా ఎందుకు పోవటంలేదు? నేనేం పాపం చేశాను? అసలు ఇతను నాకు ఎందుకు పరిచయం అయ్యాడు?

"వ్రాయలేదు అని తోసిపుచ్చటంకంటే వ్రాశాను- నాకు వ్రాయా లనిపించింది. వ్రాసేకాని వుండలేనంత అనుభూతి పొందాను అని నువ్వు ధైర్యంగా చెప్పగలిగితే నేను ఎక్కువ సంతోషించేవాడిని. నీ సాహ సాన్ని ఆరాధించేవాడిని!" అతని కంఠం ఎలాగో అయిపోయింది. "రాధా! నేను.... నేను ఏదయినా సహిస్తాను కాని అబద్ధాలు ఆడటం సహించలేను. అందులో ముఖ్యంగా ఆడవాళ్ళు. మగవాళ్ళయితే కాస్త యినా ఒప్పుకుంటాను. ఎందుకంటే, బయట ప్రపంచంలో వాళ్ళు బ్రతకా

లంటే, సంఘంలో కనిపిస్తున్న కుళ్ళు, మోసాల్ని ఎదుర్కోవాలంటే' నిజాయితీగావుండే మగవాడికి జరగదు. కాని ఆడవాళ్ళ సంగతి వేరు రాధా! వాళ్ళ ప్రపంచం పరిమితమైంది. అందులో అబద్ధం ఆడవలసిన అవసరం వుండదని నా ఉద్దేశ్యం. వాళ్ళు దేవతలని భావిస్తాను నేను."

నాకు నీరసం వచ్చింది. ఇలాటి ఉద్దేశ్యాలు స్థిరంగా ఏర్పరచుకున్న మనిషితో ఎలా మాట్లాడడం? చేదులాంటి నిజాన్ని చెప్పి ఈ అమృతమూర్తి మనసు ఎలా నొప్పించటం? నాకెటూ పాలుపోలేదు. ఆ నిమిషంలో నిజం చెప్పెయ్యాలన్న నా ధైర్యం మంచులా కరిగి పోయింది.

శేఖరం మళ్ళీ చెప్పటం ప్రారంభించాడు: "నా రాధా! నువ్వు మామూలు మనిషివి కాదు. ప్రపంచానికి నీనుంచి ఒక ఉపయోగం వుంది. అది పూర్తిగా నెరవేర్చాలి. అందుకే నేను నా పరిచయానికి స్నేహితుడుగానే గీత గీసుకుని వూరుకున్నాను. నువ్వింకా ముందు ముందు మంచి రచయిత్రివి కావాలి. అలా అని మనసారా వాంఛించే వాళ్ళలో నేను ప్రప్రథముడిని."

"అసలు నేను కథలే వ్రాయకుండా వుంటే? నేను రచయిత్రినే కాకపోతే?" అన్నాను.

శేఖరం క్షణంసేపు వూరుకున్నాడు. ఆ వెంటనే మరింత దగ్గరగా తీసుకుని హృదయానికి హత్తుకుంటూ "నేనప్పుడు నిన్ను పెళ్లిచేసుకునే వాడిని. కాని.... కాని నువ్వు రచయిత్రివి కాకపోతే అసలు మనిద్దరికీ పరిచయమే అయేది కాదేమో! అది మర్చిపోతున్నావు" అన్నాడు.

నేనేం మాట్లాడలేదు. ఎటువైపునుంచి ఈ విషయం చెప్పాలని చూసినా కుదరడంలేదు.

ఇద్దరం అలాగే నిశ్శబ్దంగా వుండిపోయాం. అతనుకూడా ఎక్కడ ఆలోచిస్తున్నాడో నన్ను వదల్లేదు. వదిలించుకుని దూరంగా జరగాలని నేనూ ప్రయత్నం చేయలేదు.

ఎప్పుడొచ్చాడో పెద్దన్నయ్య లోపలికి రాబోయి మమ్మల్ని చూసి గుమ్మంలో వెనక్కు తప్పుకున్నాడు. శేఖరం భుజంమీదనుంచి గుమ్మం వైపు చూస్తున్న నేను కెవ్వుమన్నాను. "ఏమిటి?" నన్ను వదలకుండానే

శేఖరం అదుర్దాగా అడిగాడు.

"పెద్దన్నయ్య!" రహస్యంగా అని గుమ్మంపైపు చూపించాను.

అతను వెంటనే వదిలేశాడు. పెద్దన్నయ్య లోపలికి రాకముందే నేను అక్కడినుంచి లోపలి గదిలోకి పారిపోయాను.

o o o o

గదిలోకి వెళ్ళగానే తలుపులు బిగించుకుని నేను చేసిన మొట్ట మొదటి పని పత్రిక తీసుకుని "ప్రమాదం" యావత్తూ ఒక్క అక్షరం కూడా వదలకుండా చదవటం. అందులో సారాంశం- "ఒకమ్మాయి అనుకోకుండా ఒకతని కారుక్రింద పడుతుంది. గాయాలు బాగా తగులు తాయి. తన అజాగ్రత్తవల్ల ఈ ప్రమాదం జరిగిందని బాధపడిన కథా నాయకుడు సానుభూతితో జాగ్రత్తగా సపర్యలు చేస్తాడు. 'నేను కావా లని చనిపోవడం కోసం కారుక్రింద పడ్డాను. నువ్వు చావనివ్వకుండా బ్రతికించి చంపుతున్నావు' అని ఆ అమ్మాయి వాపోతుంది. ఆత్మహత్యకి కారణాలు సవతితల్లి, తీరని దరిద్రం. ఇవికాక ఒక మూగవాడికి ఇచ్చి పెళ్ళిచేయాలని ఇంట్లోవాళ్ళు పట్టుబట్టడం. ఈ కారణాలన్నీ ఆ అమ్మాయి నోటినుంచి విన్న అతని హృదయం కరిగిపోతుంది. ప్రేమ ఏర్పడుతుంది. చివరికి పెళ్ళి చేసుకుంటాడు. అంతా ముగుస్తుంది." భావం పాతదే! కాని భాష సున్నితంగా, బహుచమత్కారంగా వుంది. వాళ్ళిద్దరిమధ్యా జరిగిన సంభాషణ అలా అద్భుతంగా, సున్నితమయిన హాస్యం మేళవించి చాలా రోజులు జ్ఞాపకం వుండేలా చేస్తుంది. రాజశేఖరం చెప్పింది నిజమే. అందులో హీరో వర్ణనకి అతను సరిగ్గా సరిపోతాడు. చివరికి అతని కుడి చేతిమీద ఉంగరం, వేలు దగ్గరున్న పుట్టుమచ్చ కూడా వర్ణించేశాడు. అది చదువుతుంటే బాగానేవుంది. కాని నేను వ్రాసినట్టు ఊహించుకుంటే సిగ్గుతో ప్రాణంపోయింది. ఇదంతా నా భావనే అని అతను అనుకోవ టంలో పొరపాటేముంది?

ఇంతలో వదిన వచ్చి తలుపు తట్టింది.

"ఏమిటి?" అన్నాను.

"మీ అన్నయ్య నీకోసం భోజనానికి కూర్చున్నారు. రా!"

"నాకు ఆకలి లేదు."

వదిన వెళ్ళిపోయింది. ఛీ—ఛీ! ఖర్మ! అన్నయ్య ఏమనుకుంటు న్నాడో ఏమిటో? నేను వచ్చేసింతర్వాత వాళ్ళిద్దరూ ఏం మాట్లాడుకుని వుంటారు? ఆలోచిస్తుండగా మళ్ళీ తలుపు తట్టిన శబ్దం విన్పించింది.

"ఊఁ!" అన్నాను విసుగ్గా.

"రాధా! భోజనానికి రా!" పెద్దన్నయ్య కంఠం. అందులో కోపం గాని, నిర్లక్ష్యంగాని ఏమీలేదు. మామూలుగానే వుంది.

"రా, వస్తున్నావా?"

తప్పనిసరిగా లేచి వచ్చాను.

అన్నానికి కూర్చున్నా నన్నమాటేగాని సయించటంలేదు.

"అమ్మా! నీ కోరిక ఫలించింది" అన్నాడు పెద్దన్నయ్య వున్న ట్టుండి.

"ఏమిటది?" అంది అమ్మ.

నేను తలెత్తి చూశాను.

చారుగిన్నె కోసం వంట ఇంట్లోకి వెళ్ళబోతున్న వదిన ఆగి పోయింది.

"రాజశేఖరం మన రాధని చేసుకుంటానన్నాడు. ఇందాకే మాట్లా డాను. మనం ముహూర్తం యెప్పుడంటే అప్పుడతనికి అంగీకారమే నన్నాడు."

"నిజంగా!" అంది అమ్మ పట్టలేని సంతోషంతో.

నేను అన్నం కెలుకుతూ కూర్చుండిపోయాను.

"చూడమ్మా! నేనింత చనువు యిస్తాను దానికి, రాధ మాట మాత్రం కూడా చెప్పలేదు!" కావాలని తెచ్చిపెట్టుకున్న నిష్ఠూరంతో అన్నాడు అన్నయ్య. నేనేం చెప్పలేదు.

"ఈ శూన్యమాసం అయిపోగానే లగ్నాలు పెట్టించేద్దాం. అయినా ఆ మాత్రం టైం లేకపోతే యెలా?" అమ్మ అప్పుడే ఆలోచించేస్తోంది.

"పెళ్ళి చాలా నిరాడంబరంగా, క్లుప్తంగా జరగాలని గట్టిగా చెప్పా డతను."

నేను కంచంలో నీళ్ళుపోసి లేచిపోయాను. రాజశేఖరం పెళ్ళి చేసుకుంటానన్నాడా? గంట క్రితమేగా స్నేహితుడుగా గీత గీసుకున్నా

నని చెప్పాడు! ఒకవేళ అన్నయ్య అలా చూశాడని- ఇక బాగుండదని చెప్పే సేదేమో! అంతే అయివుంటుంది.

"నేను యేదయినా సహిస్తాగాని అబద్ధాలు ఆడడం సహించలేను. అందులో ఆడవాళ్ళు!" చెళ్లుమని కొట్టినట్టు గుర్తొచ్చింది.

"నువ్వు రచయిత్రివి కాకపోతే అసలు మన పరిచయం అయేది కాదు." ఆ మాటలు నన్ను భూతాల్లా బెదిరించసాగినాయి. ఈ పెళ్ళి జరగటానికి వీలులేదు! ఎలా వీలుంటుంది? పెద్ద అబద్ధం ఒకటి ఆడాను. అతను ఊహించిన ఆ కళ అసలు నాలో లేనేలేదు. ఇక అతనికి నేను ఎలా నచ్చుతాను? అసంభవం!

చాలా పొద్దుపోయింతర్వాత చిన్నన్నయ్య ఇంటికి వచ్చాడు. అంతా పడుకుని నిద్రపోతున్నారు. నేనే వెళ్ళి తలుపు తీశాను. లోపల అడుగుపెడ్తూనే "రాధా! ఈ నాటకానికి అఖిల భారత నాటక ప్రదర్శనలో బహుమతి రాకపోతే చూడు- నా పేరు రామకృష్ణగాదు. వాళ్ళంతా ఎంత బాగా చేస్తున్నారో తెలుసా?" అన్నాడు.

"దయవుంచి నువ్వు త్వరగా బట్టలు మార్చుకుని అన్నానికి వస్తావా - లేకపోతే వెళ్ళి పడుకోనా?" అన్నాను.

"ఏం? ఈ రోజు రుసరుస లాడ్తున్నావు?" బట్టలు మార్చుకోటానికి వెడ్తూ అన్నాడు.

వాడు భోజనం పూర్తిచేసి చేయి కడుక్కుంటుండగా "చిన్నన్నయ్యా! నీకు బుద్ధుందా?" అన్నాను.

"ఏమిటి? నువ్వన్నమాట నేను సరిగ్గానే విన్నానా?" ఆశ్చర్యంగా చూశాడు.

"సరిగ్గానే విన్నావు. కొంచెం పేరు ప్రతిష్టలు వచ్చేసరికి కళ్ళు నెత్తికి వచ్చినాయి. మెదడు పూర్తిగా ఖరాబయింది. ఆ ప్రమాదం కథ ఒళ్ళు దగ్గరుంచుకుని వ్రాసిందేనా? శేఖరం చూసి యేమనుకుంటాడు? నేను తలెత్తి అతనితో మాట్లాడాలా?" ఇంకా ఏదేదో అనబోతున్న నన్ను రెండు చేతులూ వారిస్తున్నట్టు చాపి "ఆగాగు. నేను కేవలం ఆ కథ అతని కోసమే వ్రాశాను" అన్నాడు.

"అంటే?"

"అంటే- దాని మూలంగా అతను నీ దగ్గరగా రావాలనీ, మీ ఇద్దరూ భార్యాభర్తలు అవాలనీ నా ఉద్దేశ్యం. అమ్మకోర్కె ఫలిస్తుం దని కూడా ఆశ, సరేనా?"

వాడింత సూటిగా చెప్పటం చూసి నేను కొయ్యబారిపోయి నిలబడి పోయాను.

చేతులు తుడుచుకుని వంట ఇంట్లోంచి వెళ్ళిపోబోతూ "అతను స్నేహితుడుగా కంటే ఈఇంటి అల్లుడుగావుంటే నాకింకా చాలా లాభం. నీకు మాత్రం వాళ్ళు అంతకంటే మంచి సంబంధం తీసుకురాగలరా?" అని వెళ్ళిపోయాడు. కోపంతో, అసహ్యంతో, ఉక్కిరి బిక్కిరి అవుతూ బొమ్మలా అక్కడెంతసేపు నిలబడిపోయానో నాకే తెలియదు. నా కిప్పుడిప్పుడు కొద్ది కొద్దిగా అర్థం అవసాగింది. వాళ్ళంతా వలవన్ని నన్ను ఎరగాపెట్టి రాజశేఖరాన్ని ఇందులోకి లాగాలని చూస్తున్నారు. కంఠంలో ప్రాణం వుండగా అలాంటిపని జరగదు. నేను అంతా రేపే అతనికి చెప్పేస్తాను.

ం ం ం

మర్నాడు లేచానన్నమాటేగాని నా మనసు మనసులో లేదు. శేఖరం ఆఫీసు నంబరు నాకు తెలియదు. ఇంటికి ఫోన్ చేద్దామంటే పదిగంటలు దాటేవరకూ వీలుండదు. పెద్దన్నయ్య ఇంట్లో వుండగా నాకు ధైర్యం చాలదు. ఏం చెయ్యాలా అని ఆలోచిస్తుండగానే అన్నయ్య ఆఫీసుకి వెళ్ళిపోయాడు. చిన్నన్నయ్య 10 గంటలకే ఆదరా బాదరా కనీసం స్నానంకూడా చేయకుండా టిఫెన్, కాఫీ ముగించుకుని రిహార్సల్స్ చూడటానికి పరుగెత్తాడు. ఈ పూట ఫైనల్ రిహార్సల్స్‌ట. ఈ సాయంత్రమే ఆ డ్రామా గ్రూప్ అంతా ఢిల్లీకి బయలుదేరుతుంది.

వదిన వంట ఇంట్లో పని చూసుకుంటోంది. అమ్మ పక్కింటి పిన్ని గారిని పెళ్ళికి సమకూర్చుకోవలసిన వాటిని గురించి సంప్రదించి వస్తానని వెళ్ళింది. ఏం చెయ్యటానికి తోచక అటు యిటు తారట్లాడూ తిరుగుతున్న నేను ఫోన్ గణ గణా మోగటంతో వెళ్ళి తీసుకున్నాను.

"హలో!"

"యస్!"

"ఎవరు, రాధా?"

నా గుండె లయ తప్పింది. అవతల మాట్లాడుతోంది శేఖరం! "మీరా!" తడబడుతూ అన్నాను.

"అవును. ఏం?"

"ఏంలేదు. కాని...." నేను చెప్పాలనుకున్న మాటకి ప్రారంభం వెతుక్కుంటూ అన్నాను.

"ఏమిటి, అలా ఖంగారు పడుతున్నావు? అక్కడెవరయినా వున్నారా?"

"ఉహుఁ!"

"నిలబడివున్నావా; కూర్చున్నావా?"

"నిలబడే వున్నాను."

"అయితే కూర్చో-నీతో కొంచెంసేపు మాట్లాడాలి."

నీరసంగా పక్కన వున్న కుర్చీని లాక్కుని కూర్చున్నాను.

"రాధా! మీ అన్నయ్య చెప్పే వుంటారు."

"అవును. కాని....కాని...."

"కాని ఏమిటి?"

"మీకు తెలియదు. ఈ పెళ్ళి జరగటానికి వీల్లేదు!" ఎలాగో ధైర్యం చేసి సూటిగా అనేశాను.

క్షణంసేపు అవతలనుంచి శబ్దం విన్పించలేదు, నాకు భయం వేసింది.

"హలో!"

"ఎందుకు జరగకూడదో చెప్పు" అన్నాడు. అతని కంఠంలో అప్యాయత లేదు. పొడిగా, పట్టనట్టుగా వుంది.

"కారణాలు చాలా వున్నాయి!"

"ఏమిటవి? మచ్చుకి ఒకటి చెప్పు."

"మొదటిది నేను.... నేను మీకు తగను."

"నన్ను వెక్కిరిస్తున్నావా?"

"లేదు లేదు, నిజంగా చెబుతున్నాను."

"నువ్వది నిజంగా అన్నట్లయితే నా సమాధానం ఇది. అర్హతలు నిర్ణయించు కోవాల్సింది నేను, నువ్వుకాదు."

"కానీ...."

"కానీలతో చంపకు నన్ను. విషయంఏమిటో సూటిగాచెప్పెయ్యి!" కంఠంలో విసుగు కన్పించింది.

"మీకు తెలియదు. మీకు నచ్చని గుణాలు నాలో చాలా వున్నాయి."

"అదిగో! ఆ డొంకతిరుగుడు మానెయ్యమని చెప్పలేదూ!" కసిరి నట్లు అన్నాడు. నాకు నోట్లోంచి మాటే రాలేదు.

ఇద్దరి మధ్యా నిశ్శబ్దం ఏర్పడింది.

"రాధా!" అవతలనుంచి ఆప్యాయంగా విన్పించింది.

"ఊఁ!"

"ఏమిటి నీ అభ్యంతరం? భయపడకుండా చెప్పు."

అప్పటికీ నేను మాట్లాడలేదు.

"నిన్న మనల్ని ఆలా చూసింతర్వాత మీ అన్నయ్య! ఏమనుకుం కుంటాడు చెప్పు."

సరిగ్గా నేను వూహించిందే నిజమయింది. "అది పొరపాటుగా జరిగిపోయిందనీ, అందులో మీకేం భాగం లేదనీ, తప్పంతా నాది అనీ అన్నయ్యకి నేను నచ్చచెప్పాను."

"ఎంత త్యాగం చేశావు!"

"నవ్వులాటకాదు."

"నేనూ అదే చెప్పాలనుకుంటున్నాను రాధా! నిన్న నేను నిన్ను దగ్గరికి తీసుకున్నప్పుడు మనస్ఫూర్తిగానే తీసుకున్నాను. అది పొర పాటు కాని, తొందరపాటుకాని కానేకాదు. ఇన్నాళ్ళనుంచి నీ భవిష్య త్తుకి నేనేమయినా అడ్డు అవుతానేమో అని భయంతో వూరుకున్నాను. దాన్నికూడా నిన్నటితో వదిలేశాను."

నా చెయ్యి ఫోనుమీద గట్టిగా బిగుసుకుంది.

"మర్చిపోయా! నేను సాయంత్రం బొంబాయి వెడుతున్నాను. అది చెప్పటానికే నిన్ను పిలిచింది. 20 రోజుల వరకూ రాను బొంబాయి నుంచి. నీకేం కావాలో చెప్పు?"

ఏదయినాసరే ఏదో ఒకటి మాట్లాడాలని వ్యర్థ ప్రయత్నం చేస్తున్నాను నేను. "రాధా!" ఎంత తియ్యగా వుందాపిలుపు! ఆపిలుపులో ఎంత అనురాగం తొణికిసలాడ్తోంది. నాకది వింటుంటే దొంగతనం చేస్తున్నట్టు అన్పిస్తోంది.

"రాధా! నా అండతో నువ్వింకా బాగా ప్రపంచం చూడాలి. ఇంకా మంచి రచయిత్రివి కావాలి. ఉజ్వలమైన నీ భవిష్యత్‌కి ప్రథమ సోపానం నాపరిచయంఅని గుర్తుకురాగానే నేనుగర్వించాలి, ఏమంటావు?"

ఏమంటాను? ఈ పళంగా వెళ్ళి ఎందులోనయినా పడి చావాలని మనసారా కోరుకుంటున్న నేను-యేం మాట్లాడ్తాను?

"నే నుంటాను. నా కింక పనుంది. ఈ 20 రోజుల్లో నీ కథల గొడవలోపడి నన్ను మర్చిపోవుగా? నువ్వు నా దానివి కాబోతున్నావు అని తెలిసిన తర్వాత నిన్ను వదలి దూరంగా వుండాలంటే యెంత బాధగా వుందో తెలుసా? అదేమిటి! మాటా పలుకూ లేకుండా అలా వున్నావేం?" ఆదుర్దాగా అడిగాడు.

"ఏంలేదు. మీ మాటలు వింటున్నాను!" నిర్జీవంగా అన్నాను.

"పెళ్ళయిపోగానే ఒక ఆర్నెల్లపాటు దేశం అంతా నిన్ను తిప్పుతాను. నీకోసం నేనింకా రకరకాల మనుష్యులతో పరిచయం ఏర్పరచుకుంటాను. రచయితకి రకరకాల మనుష్యులని కలవటం చాలా అవసరం. ఇదంతా ఎందుకు చెప్తానో తెలుసా? నిజం చెప్పనా? నీకోసం కాదు; నా కోసం. కేవలం నా స్వార్థంతో, ఇవన్నీ చూసిన నువ్వు 'మీ భార్య కావటం నాకెంత అదృష్టం' అంటూ నామీద ప్రేమని యింకా పెంచుకోటానికి, నన్ను మరింత అపురూపంగా చూడటానికిన్నీ!"

ఇంత ఖచ్చితంగా తన మనసు విప్పి మాట్లాడుతున్న మనిషి నేను కూడా అలా వుండాలనుకోవటంలో ఆశ్చర్యం ఏముంది?

"ఇక వుండనా? ఏదయినా ఒక మంచి మాట చెప్పు."

"ఏం చెప్పను?"

"రచయిత్రివి నీకు నేను నేర్పాలా?" అతని నవ్వు నా మనసుని గిలిగింతలు పెట్టింది.

"అబ్బ! మళ్ళీ 20 రోజుల తర్వాత నీదర్శనం. రాధా! సాయంత్రం వెళ్ళేముందు నీకు కన్పిస్తాను."

ఏ టైమ్‌కి వస్తాడో చెప్తే బాగుండు, ఆ సమయంలో ఇంట్లో లేకుండా పారిపోవచ్చు. కాని అతను టైమ్ చెప్పలేదు. ఉంటానని ఫోన్ పెట్టేశాడు. రాజశేఖరం మాట్లాడటం అయితే జరిగింది. కాని నా వుద్దేశ్యం నెరవేరలేదు. అతను వూరువెళ్ళి 20 రోజులకి కాని రాడు - అన్న సంగతి కాస్త హాయి అన్పించింది. ఈ లోపల జాగ్రత్తగా ఆలోచిస్తే ఏదయినా ఉపాయం దొరక్కపోదు.

ఆ సాయంత్రం అతను వచ్చాడు. నిన్నటి శేఖరానికి యిప్పుడు కనిపిస్తున్న ఈ శేఖరానికి నాకేదో తేడా కన్పించింది. ఇదివరకు నావైపు చూసేటప్పుడు ఆ కళ్ళలో వో విధమయిన గంభీరత, మర్యాద వుట్టిపడేవి. ఈ రోజు అధికారం, ఆప్యాయత, చిలిపితనం స్పష్టంగా కనిపిస్తున్నాయి.

అతను వచ్చాడని తెలియగానే అమ్మవచ్చి పలకరించి లోపలికి వెళ్ళిపోయింది. వదిన వంటయింట్లో కాఫీ త్వరగా తయారుచేయటానికి శ్రమపడుతోంది.

హాల్లో అతనితో వంటరిగా నిలబడిపోయాను.

"అలా వున్నావేం? ఒంట్లో బాగాలేదా?" దగ్గరగావస్తూ అడిగాడు.

క్షణం సేపు మా యిద్దరి చూపులు కలుసుకున్నాయి. "రాత్రంతా నిద్రపోయి వుండవు. నేనుకూడా పోలేదు" అంటూనే జేబులోని చిన్న పెట్టె తీసి "ఏమిటి చెప్పు" అన్నాడు.

"ఏమిటది?" కుతూహలం తెచ్చి పెట్టుకుంటూ అడిగాను.

"అన్ని రోజుల ఈ యెడబాటులో నన్ను అనుక్షణం నీకు గుర్తు తెచ్చేందుకు ఓ చిహ్నం. లేకపోతే నీ కథల గొడవలో నన్ను పూర్తిగా మర్చిపోతావేమోనని నాకు భయం!" పెట్టె తెరచి అందులోంచి వుంగరం తీస్తూ అన్నాడు. ఎర్రటి దానిమ్మగింజ రంగు రాయితో అతని వ్యక్తిత్వం లానే మిల మిలా మెరుస్తున్న వుంగరం!

అతను చనువుగా నా యెడమచేతిని తీసుకుని వేలికి తొడిగాడు. సరిగ్గా సరిపోయింది. ఉంగరం వున్న చేతిని కొద్దిదూరంగా పెట్టి పరిశీలనగా చూస్తూ "ఫారెన్‌లో ఇలా పెళ్ళి కాకముందే యిచ్చే వుంగరాన్ని ప్రధానపు వుంగరం అంటారు" అన్నాడు.

"కాని, యిది ఫారెన్ కాదుగా!" అన్నాను నేను.

"మనదేశంలో అయితే పెళ్ళిగాని మగవాడు పెళ్ళికాని ఆడపిల్లకు ఉంగరంలాటిది ఇస్తే పెళ్ళియినట్టే" అన్నాడు నవ్వుతూ.

ఇంకేం మాట్లాడాలో తోచక వూరుకున్నాను.

"రాధా!" శేఖరం రెండు చేతులూ నా భుజాలమీద పడినాయి. ఏదో చెప్పబోయినవాడల్లా వదిన కంఠం విన్పించడంతో ఆగి దూరంగా వెళ్ళి, అంతక్రితం తను కూర్చున్న కుర్చీలో కూర్చున్నాడు.

వదిన కాఫీ తెచ్చి యిచ్చింది. శేఖరం వెళ్ళబోయేముందు కళ్ళతోనే నావద్ద శలవు తీసుకున్నాడు. అతను వెళ్ళగానే వదిన నావైపు తిరుగుతూ "ఏమిటి-నీ చేతిని యెర్రగా మెరుస్తోంది?" అంది.

నేను చేయి చప్పున వెనక్కి దాచుకొన్నాను.

వదిన నవ్వుతూ "అర్థమైందిలే" అన్నట్టు కొంటెగా చూసింది.

మా వదిన నోట్లో అసలు మాట దాగదుగదా! ఆ సాయంత్రానికే అన్నయ్యలిద్దరికీ, అమ్మకీ నా వుంగరం సంగతి తెలిసిపోయింది.

నేను తీసి పెట్లో పడెయ్యటం చూసిన అమ్మ "అదేమిటీ తీస్తావు, ఉంచుకో!" అని మందలించింది.

"రాత్రి నా మీద ఎగిరావుగా!" చిన్నన్నయ్య వాక్యం పూర్తికాకుండానే "చాల్లే! గొప్పగా మాట్లాడవచ్చావు" అంటూ అక్కడినుంచి వెళ్ళిపోయాను.

చిన్నన్నయ్య కూడా ఆ రాత్రి డ్రామా ట్రూప్‌తో ఢిల్లీ వెడుతున్నాడు.

ం ం ం ం

రోజులు గడిచిపోతున్నాయి. శేఖరం తిరిగి వచ్చేరోజు దగ్గర పడ్తోంది. నాకెటూ పాలుపోవటం లేదు. ఏంచెయ్యాలి నేను? రచయిత్రిని కాదు అన్న సత్యాన్ని అతనికి ఏ విధంగా తెలియజేయాలి? ఈ సమ

న్యతో రాత్రింబవళ్ళు వేగిపోతున్నాను. నేను చివరికి ఆలోచించి, ఓ నిర్ణయానికి వచ్చాను. జరిగినదంతా విపులంగా మొదలునుంచి తుదివరకూ ఉత్తరం వ్రాసిపెట్టాను. సుదీర్ఘమైన ఆ వుత్తరం వ్రాయటానికి నేను చాలా శ్రమపడాల్సి వచ్చింది. చిన్న చిన్న వాక్యాలకోసం, వాటిని పూర్తి చేయటానికి తగిన మాటలకోసం ఎంతోసేపు ఆలోచించాను. నా ఈ వుత్తరం చదివితే నేను రచయిత్రిని కాననీ, యే జన్మలోనూ కాలేనని స్పష్టంగా తెలిసిపోతుంది.

ఢిల్లీనుంచి చిన్నన్నయ్య టెలిగ్రాం యిచ్చాడు- "అమృత హృదయాలకు" ప్రథమ బహుమతి వచ్చిందట. డ్రామా ట్రూప్ అంతా నాకు అభినందనలు తెలుపమన్నారట. వాళ్ళు రేపు బయలుదేరి వచ్చేస్తున్నారు. అదే పోస్టులో శేఖరం వద్దనుంచికూడా వుత్తరం వచ్చింది. చాలా చిన్న వుత్తరం- "నీ కథల గొడవలో పడి నన్ను మర్చిపోయావా? కనీసం ఉంగరం చూసినప్పుడయినా గుర్తుకు వస్తానని ఆశిస్తాను. ఎప్పుడూలేంది ఈ కంపెనీ మీటింగులు చాలా విసుగు వస్తున్నాయి. ఎప్పుడెప్పుడు వచ్చి నిన్ను చూసానా అని మనసంతా నిన్ను నింపుకుని నీ గురించే ఆలోచిస్తున్న నీ శేఖరం."

ఆ వుత్తరం కనీసం పదిసార్లయినా చదివి వుంటాను. భగవాన్! శేఖరం అనుకున్నట్టు నేను నిజంగా రచయిత్రిని అయితే! పోనీ కష్టపడి నేర్చుకుందామనుకున్నా యిది అభ్యాసం చేస్తే వచ్చే విద్యకాదే - ఏం చేయాలి నేను? ఆప్యాయత నిండి—అనురాగం తొణికిసలాడుతున్న ఆ చిన్న ఉత్తరం వెన్నెలలో కూర్చున్నట్లు మనసుకి ఆనందం కలిగించి ఆహ్లాదంగా వుంచేబదులు మండుటెండలో, ఎడారిమధ్య ఒంటరిగా నిలబడి దిక్కులు చూస్తున్నట్టు హృదయం విల విలలాడేటట్లు చేసింది.

అన్నయ్య ఢిల్లీనుంచి వచ్చాడు. నాటకానికి ఈ బహుమతి రావటంతో వాడు భూమ్మీద నడవడం మానేశాడు. ఎప్పుడు చూసినా అతి హుషారుగా గాలిలో తేలిపోతున్నట్టు, పట్టరాని సంతోషంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నట్టు వున్నాడు. ఓ మూలగా వాడిపోయిన ముఖంతో, యెర్రబడిన కళ్ళతో, చెయ్యని తప్పుకి కఠినమయిన శిక్ష అనుభవిస్తున్న మనిషిలా నేను కుమిలిపోతున్నాను.

డ్రామా ట్రూప్ తరపున రవీంద్రభారతిలో ఘనంగా సన్మానం ఏర్పాటయింది. ముఖ్యమంత్రి అధ్యక్షత వహిస్తున్నారు.

"అన్నయ్యా! ఇంకా ఎందుకీ దాగుడుమూతలు? కనీసం ఇప్పుడైనా ఈ రహస్యం బయటపెట్టేయ్!" అన్నాను వాడిదగ్గరగా వెళ్ళి.

పేపరులో ఆ నాటకాన్ని గురించి సమీక్ష చదువుతున్నవాడు మంచం మీదనుండి మోచేతిమీద లేస్తూ "ఏమిటి?" అన్నాడు.

"రేపు సభలో నిజం చెప్పేద్దాం!" నిలబడటానికి కూడా నాకు ఓపిక లేదు. నీరసంగా వాడి కాళ్ళదగ్గర మంచంమీద కూలబడ్డాను.

వాడు చటుక్కున లేచి కూర్చున్నాడు. "ఇంకా ఎంతకాలం ఈ మోసం?" అన్నాను.

ప్రపంచాన్ని మోసం చెయ్యటం లేదు. నాకు ప్రియాతిప్రియ మయిన వ్యక్తిని మోసపుచ్చుతున్నాను అనేబాధ నా నరాలను కొరికేస్తోంది.

చిన్నన్నయ్య కొద్దిసేపు ఆలోచించి "రాధా! ఒక్కమాట చెప్పనా?" అన్నాడు.

చెప్పమన్నట్టు చూశాను.

"ఈ రహస్యం మనిద్దరిమధ్యా ఇలాగే వుండిపోనీ, ప్రపంచానికి తెలియాల్సిన అవసరం లేదు."

"అంటే?"

"అంటే ఏమిటో చెప్పమంటావా? విను చెప్తాను. ఇదివరకెల్లా కొద్ది పేరురాగానే అసలు విషయం బయట పెట్టెయ్యాలని నీకంటే వేయిరేట్లు ఎక్కువ ఆత్రంగా వుండేది. కాని నిన్న ఈ నాటకానికి బహుమతివచ్చిన తర్వాత ఆ అభిప్రాయం యెగిరిపోయింది. రాధా! ఈ అదృష్టం, ఈ పేరు ప్రతిష్టలు అన్నీ నీపేరు బలంవల్లనేమో అన్పిసోంది నాకు. నా పేరు నీ పేరుస్థానంలో నిలబెట్టితే దురదృష్టం దూసుకు వచ్చి వీటన్నిటినీ మింగివేస్తుందేమోనని భయం పట్టుకుంది. నిజం చెప్పు, నా పేరుమీద యింతవరకూ యెప్పుడన్నా యే చిన్న పనయినా కలసి రావటం నువ్వు చూశావా? ఇదివరకయితే ఈ విషయం యెవరయినా యెత్తి చూపిస్తే అవమానించినట్టు రోషపడేవాడిని. ఇప్పుడలా కాదు. నిజాన్ని ఒప్పుకోవటంలోనే మనిషి నిజమయిన వ్యక్తిత్వం బయటపడు

తూంది. రాధా! ఇప్పుడుకాదు, ఎప్పటికీ నువ్వు రచయిత్రివికాదు అన్న సంగతి బయటికి రాదు. బయట పడకుండా నేను జాగ్రత్త పడతాను. తెలిసిందా?" అన్నాడు.

కళ్ళప్పగించి చూస్తున్న నాకు నోట్లోంచి మాట రాలేదు.

చిన్నన్నయ్య ఆప్యాయంగా నా భుజంమీద తట్టి, "అయినా నువ్వు పరాయిదానివి కాదుగా! నా రక్తం పంచుకుపుట్టిన చెల్లెలివి. నాకు రావాల్సిన కీర్తి ప్రతిష్ఠలు లోకం నీ కిస్తుంటే నేనేం యీర్ష్యపడను. సరేనా? ఈరోజు నుంచి నువ్వు కూడా రచయిత్రివనే నమ్మాలి."

కొద్దిసేపయింతర్వాత ఎవరోవచ్చి పిలవటంతో చిన్నన్నయ్య వెళ్ళిపోయాడు. కాని, నేనలా బిగుసుకుపోయి అక్కడే కూర్చుండి పోయాను.

o o o

ఆ రోజు సాయంత్రమే రవీంద్రభారతిలో సన్మానం ఏర్పాట్లు ఘనంగా జరిగాయని చిన్నన్నయ్య చెప్పాడు. నేను యిదివరకులా భయ పడలేదు. కారణం నా మనస్సులో ఓ విధమైన నిశ్చయం యేర్పడింది. ప్రతిసారిలా సన్మానం అనగానే నా కాళ్ళు వణకలేదు. చేతుల్లో చెమట పట్టలేదు. రాయిలా అదంతా నాకు కాదన్నట్టు వున్నాను. చిన్నన్నయ్య దీనికోసం ప్రత్యేకంగా తెచ్చిన చీర కట్టుకున్నాను. ఆ ఉదయమే శేఖరం బొంబాయినుంచి వచ్చాడు. వచ్చీరాగానే నాకు ఫోన్ చేశాడు. పని చాలావుండటంవల్ల వెంటనే కలుసుకోలేక పోతున్నానని, సాయంత్రం తప్పకుండా వస్తానని అన్నాడు. సాయంత్రం రవీంద్రభారతిలో జరుగబోతున్న సభ సంగతి చెప్పాను.

"ఓ!" కంఠంలో నిరాశ కొట్టొచ్చినట్టు కన్పించింది.

నేనేం మాట్లాడలేదు.

"రాధా! ఒక్కమాట నిజంగా చెప్పు. ఈ గొడవలో నేనసలు నీకు గుర్తున్నానా?"

"మరొకసారి కన్పించినప్పుడు చెప్తాను. సాయంత్రం మీరు రవీంద్ర భారతికి వస్తున్నారా, లేదా?"

"రావటంలేదు. చాలా అలసటగా వుంది."

"కాదు, రావాలి. ప్లీజ్! మానకండి."

"రాధా! నిజం చెప్పమంటావా?"

"చెప్పండి."

"ఇన్ని రోజుల తర్వాత కలుసుకున్నప్పుడు నిన్నంతమందిలో చూసి యేమీ ఎరగనట్టు ఇంటికి వచ్చేయటం నా చేతకాదు. మనం ఒంటరిగానే కలుసుకోవాలి."

నేను పెదవి కొరుక్కుంటూ నిలబడిపోయాను.

"రచయిత్రివి, ఈమాత్రం మగవాడి మనసు అర్థంచేసుకోలేవూ?"

"లేదు, లేదు. మీరు రావాలి. వచ్చితీరాలి. మీకోసం చూస్తుంటాను. రాకపోతే నేను చచ్చిపోయినంత ఒట్టు." గబగబా అని, 'రాధా-రాధా' అని అవతల ఆత్రంగా అంటున్నా విన్పించుకోకుండా ఫోన్ పెట్టేశాను.

ం ం ం

చిన్నన్నయ్య చెప్పింది నిజమే! ఏర్పాట్లు చాలా గొప్పగా జరిగాయి. ఆహూతులతో హాలంతా కిటకిట లాడుతోంది. వేదికమీదికి వెళ్ళి కూర్చున్నాను. నాతోపాటు నాటకంలో పాత్రలు ధరించిన వాళ్ళంతా కూడా అక్కడున్నారు. అధ్యక్షత వహించిన ముఖ్యమంత్రిగారు లేచి నాటక కళని గురించి మాట్లాడుతూ, దానికి ప్రజలు ఇవ్వవలసిన ప్రోత్సాహం చాలా ఉందని, ప్రభుత్వం పుడుతాభ కిగా యేదో కాస్త సహాయం మాత్రం చేయగలదనీ అన్నారు. ఇలా తెలుగు నాటకానికి బహుమతి రావటం నిజంగా గర్వించవలసిన విషయం అని పేర్కొంటూ, యిక ముందు ఇలాటివి, ఇంతకంటే మంచివి చాలా నాటకాలు వస్తాయని తను ఆశిస్తున్నానన్నారు. ఇంత చక్కటి నాటకం ఇంత చిన్న వయసులో వ్రాయగలిగిన నన్ను అభినందించారు. ఈ నాటకాన్ని అద్భుతంగా ప్రదర్శించిన నటీనటులని పొగిడారు. ప్రసంగం ముగిసింతర్వాత మా అందరిని ఒక్కొక్కర్ని సభికులకి పరిచయం చేశారు. నేను లేవగానే చప్పట్లతో హాలంతా మారుమోగిపోయింది. నేను కూర్చున్న తర్వాత కూడా అవి ఆగలేదు. ముఖ్యమంత్రిగారు నావైపు సాదరాభిమానాలతో చూశారు.

వేదికమీదికి రాగానే నా కళ్ళు క్షణంసేపు ముందువరసని కలియ

జూసినాయి. అక్కడ ఎదురుగుండా నీట్‌గా వున్న డ్రస్సులో కాలుమీద కాలేసుకుని కూర్చున్న శేఖరం కన్పించాడు.మా ఇద్దరి చూపులు క్షణంలో సగంసేపు కలుసుకున్నాయి. ఆ కాస్తలోనే అతని పెదవులు మనోహర మైన చిరునవ్వుతో విచ్చుకున్నాయి. ఒక్కసారి అతన్ని చూసి గట్టిగా వూపిరి పీల్చుకున్న నేను మరింకోసారి అటువయిపు చూడలేదు.

బహుమతి అందుకొన్న నటీనటులంతా ఎవరికి తోచిన విధంగా వాళ్లు మాట్లాడారు. ఆ నాటకానికి దర్శకత్వం వహించిన ఒక లావుపాటి ఆయన గుబురుమీసాలు సరిచేసుకుంటూ వాళ్ళు పడిన సాధకబాధకాలన్నీ సవివరంగా సభికులకు చెప్పుకోవటం ప్రారంభించాడు. 'అదంతా మాకు అనవసరం. ఇక నోర్ముయ్' అన్నట్టు ప్రేక్షకులు లయబద్ధంగా చప్పట్లు ప్రారంభించారు. చేసేదిలేక ఆయన బలవంతంగా, అయిష్టంగా చురచుర చూస్తూ ఉపన్యాసం ముగించాడు.

ముఖ్యమంత్రిగారు లేచి నన్ను మాట్లాడమని అడిగారు.

నేను లేచి మైక్ దగ్గరికి వచ్చాను.

ఒక్కసారి హాలంతా నిశ్శబ్దం అయిపోయింది.

"సోదర సోదరీమణులారా!" ఇదివరకు చాలాసార్లు ఇలా స్టేజీ మీదకు రావటంవల్ల ఈసారి నాకేం భయం కలగలేదు. నేను ఉపన్యాసం మొదలుపెట్టగానే కెమెరాలు నావంక యాంగిల్స్ చూసుకోవటం ప్రారంభించాయి. కాని చిత్రమేమిటి అంటే, నాకెలాటి భయం వేయలేదు. నిర్భయంగా, జంకూ గొంకూ లేకుండా మాట్లాడటం ప్రారంభించాను:

"మీరు చూపిన ఈ ఆదర సత్కారాలు అందుకునే ముందు నేను మీకు ఓ చిన్న ఉపకథ చెప్తాను. అది సాంతం విన్న తర్వాత ఇప్పుడు జరిగిన ఈ సన్మానానికి నేను అర్హురాలిని అవునో కాదో మీరే నిర్ణయించు దురుగాని" అంటూ మొదలుపెట్టి, ఆ మధ్యాహ్నం చిన్నన్నయ్య కథ తిరిగిరావటం నుంచి ఈ రోజు సన్మానం వరకూ వివరంగా చెప్పేశాను. చెబుతుంటే నాకు పెద్ద హాలు, దాన్నిండా కిటకిటలాడుతున్న ప్రేక్షకులు కన్పించలేదు. నా కళ్ళముందు కన్పిస్తున్నది ఒకే ఒక ముఖం - అతనికే చెప్పుకుంటున్నాను నేను.

మధ్యలో ఎందుకో ఆగిన నాకు హాలంతా నిశ్శబ్దంగా ఊపిరి పీల్చటంకూడా మర్చిపోయినట్టు కన్పించింది. ముందు సీట్లో అంతకు ముందు కాలుమీద కాలేసుకుని వెనక్కి ఆనుకుని కూర్చున్న శేఖరం సరిగ్గా కూర్చుని ముందుకు వాలి మరీ వింటున్నాడు. అతని ప్రక్కనున్న పెద్దన్నయ్య, వదిన నవ్వు ముఖాలతో నావైపు చూస్తున్నారు. చిన్నన్నయ్య రెండు చేతులు జుట్టులోకి పోనిచ్చుకుని "భగవంతుడా! నాకేది దారి?" అన్నట్టు కూర్చున్నాడు.

"రోజురోజుకీ పెరిగిపోతున్న ఈ కీర్తి-ప్రతిష్ఠల భారం నేను మోయలేననే భయంతో ఈ రోజు మా చిన్నన్నయ్య యిష్టానికి వ్యతిరేకంగా ధైర్యంచేసి ఈ నిజాన్ని మీముందు బయటపెట్టేశాను. అర్హతలేనివ్యక్తి ప్రశంస పొందటం అధర్మం. ఆసత్యాన్ని తెలిసికూడా దాచడం అనేది ఇంకా నీచం. మీరంతా నిజంగా మనస్ఫూర్తిగా రచనలు చూసే యింత ఆదరం చూపించివుంటే అది మా చిన్నన్నయ్య మగవాడు అయినంతమాత్రాన ఆవగింజంత కూడా తగ్గదని నా విశ్వాసం. అలాకాక నా ఉద్దేశం పొరపాటు అయితే మీరు చూపిస్తున్న ఈ అభిమానం ఒక కళని గుర్తించి కాదనీ, ఒక వ్యక్తిని గురించి అనీ చెప్పాల్సి వస్తుంది. ఆంధ్రులు అలాంటి అల్పమనస్కులు కాదని గుర్తు చేయటానికి నేను గర్వపడుతున్నాను. వాళ్ళకి కావల్సింది కళగాని, వ్యక్తికాదని ఘంటాపథంగా చెప్పగలను. ఇక మీ రనుమతిస్తే ఈ ప్రసంగంనుంచే కాదు; ఈ రచయిత్రిగా నటననుంచే నేను శాశ్వతంగా నిష్క్రమిస్తాను. శలవ్" అని చేతులు జోడించి నమస్కరించి వచ్చి నా స్థానంలో కూర్చున్నాను. సభికులంతా చప్పట్లు కొట్టకపోతేమానె; కనీసం మోసం, అన్యాయం అనికూడా అరవలేదు. తిట్టటంకూడా మర్చిపోయినట్టు శిలాప్రతిమలై కూర్చున్నారు.

అందరిలోకి ముందు తేరుకుంది ముఖ్యమంత్రిగారు. ఆయన లేచి మళ్ళీ మాట్లాడడం మొదలుపెట్టారు: "నిజంగా ఇది ఒక అద్భుతమైన కథలా వుంది. చిరంజీవి అనూరాధ ధైర్యానికి, నిజాయితీకి నేనుమెచ్చుకుంటున్నాను. ఇంత కథకి కథానాయకుడై, యిప్పటివరకూ తెరచాటున వున్న ఆ రామకృష్ణుని దయయుంచి వేదికమీదికి రావలసిందిగా మీ

అందరి తరఫున నేను కోరుతున్నాను" అన్నాడు.

చిన్నన్నయ్య నిద్రలో లేచి నడుస్తున్న మనిషిలా తూలుతూ స్టేజీ మీదికి వచ్చాడు. వాడిని పరిచయం చేయగానే ఒక్కసారి కరతాళ ధ్వనులు మిన్నుముట్టాయి. చిన్నన్నయ్య మైక్ దగ్గరగా నిలబడి తన కథలు ఎలా తిరిగివచ్చాయో, ఎలాటి పరిస్థితుల్లో తనీపని చేయాల్సి వచ్చిందో చెప్పసాగాడు. ఆవేశంతో, మంచి తీక్షణమైన వాక్యాలతో ఆప కుండా మాట్లాడుతున్న వాడిమాటలు నిజంగా చాలా బాగున్నాయి. అందరితోపాటు నేనూ చెవులు అప్పగించుకుని, వాడివైపు రెప్ప వాల్చ కుండా చూస్తూ వినసాగాను.

మధ్యలో ఎప్పుడో అనుకోకుండా శేఖరం కుర్చీవైపు చూసిన నేను వెంటనే వులిక్కిపడ్డాను. అతనక్కడలేడు! ఖాళీ కుర్చీ నా వైపు ఒంటికన్ను రాక్షసిలా వికృతంగా చూస్తూ హేళనగా విరగబడినవ్వింది. నా గుండెలు ఆగిపోయినాయి. వాటిమీద మంచుకంటే శీతలంగావున్న బరువు ఏదో పెట్టి నొక్కుతున్నట్టు క్రుంగిపోసాగినవి. తర్వాత కార్య క్రమం అంతా ఎలా ముగిసిందో, నేను ఇంటికి ఎలా వచ్చానో నాకే తెలియదు.

ఆ రాత్రి మంచంమీద నిద్రలేని కళ్ళతో, జీవంలేని ముఖంతో కూర్చునివున్న నా దగ్గరికి చిన్నన్నయ్య వచ్చి నా రెండు చేతులు పట్టు కుని నీళ్ళు నిండిన కళ్ళతో "నీ ఋణం జన్మలో తీర్చుకోలేను. నాకు ముందు చెప్పకుండా, అలా బయటపెట్టటం చాలా మంచిదయింది" అన్నాడు.

"నీ ఋణం నేనుకూడా తీర్చుకోలేను. నా భుజాల మీదనుంచి కీర్తి సౌధానికి నిన్ను జాగ్రత్తగా చేర్చాను. ఆ అఘాతంలోపడి నామరూపాలు లేకుండా నాశనం అయాను. నువ్వు కావాలి అనుకున్నదంతా పొందావు. నీకేం? ఆశించిందంతా పోగొట్టుకున్న అభాగ్యురాలిని నేను. ఇప్పుడు నా జీవితానికి అర్థమే పోయింది". అనుకున్నా మనసులో ఎంతో ఆనందంతో వున్న చిన్నన్నయ్యని నా మనసులో కెలుకుతున్న యీ మాటలు పైకి అని బాధపెట్టటం నాకిష్టం లేకపోయింది. అందుకే మౌనంగా వూరు కున్నాను. శేఖరం ఇక నా ముఖం చూడడు. అది యథార్థం. భరించ

లేకపోయినా తప్పని ఘాటయిన సత్యం- "అబద్ధాలు ఆడటం భరించ లేను. అందులో ఆడవాళ్ళు!" ఆ వాక్యం వేయి గొంతులతో నా చుట్టూ అరుస్తోంది. ఆ రాత్రి నేను నిద్రపోలేదని మీకు వేరే చెప్పనవసరంలేదు.

ం ం ం ం

మర్నాడు పేపర్లనిండా పెద్ద పెద్ద అక్షరాలతో ఇదే వార్త. దానికి వింత వింత వ్యాఖ్యానాలు. అనేక రకాల కథలు కల్పించబడి నాయి. విరామం లేకుండా ఒకటే ఫోన్ కాల్స్. చిన్నన్నయ్య ఓపికగా వాటన్నిటికీ జవాబు చెప్పాడు.

మూడురోజులు గడిచిపోయినాయి. శేఖరం జాడలేదు. కనీసం యేమిటిది అని ఫోన్‌కూడా చెయ్యలేదు. పెద్దన్నయ్య పనిమీద బెజవాడ వెళ్ళాడు. చిన్నన్నయ్యకి కొత్తగా లభించిన ఈ ప్రపంచంతో తిండికి, ఇంటికి రావాలన్న ధ్యాసకూడా పోయింది. అమ్మా వదినా అమాయకుల్లా పెళ్ళి ప్రయత్నాలు చేస్తుండటం చూసి నా గుండె నీరుకారిపోయింది. 'ఈపెళ్ళి జరగదు. మీరు అనవసరంగా శ్రమపడుతున్నారు' అని వాళ్ళిద్ద రికీ యెలా చెప్పాలో నాకర్థం కాలేదు. శేఖరం నన్నిలా కర్కశంగా శిక్షించాడని నాకేం కోపంలేదు. తప్పు చేసినప్పుడు శిక్ష పొందటానికి సిగ్గెందుకు? బాధ మాత్రం ఎందుకుండాలి? కాని మా యిద్దరి పరిచయా నికీ, అనురాగానికి చిహ్నంగా అతనిచ్చిన వుంగరం ఒకటి నా దగ్గ రుంది. అర్హతలేని నేను దాన్ని మాత్రం ఎలా దగ్గరుంచుకుంటాను? అతన్ని కలుసుకుని అది తిరిగి యిచ్చేసి "మోసం చేయాలన్న ఉద్దేశ్యం నా కెప్పుడూలేదు. కొన్ని సమయాల్లో మనిషి పరిస్థితులకి అలా బానిస అవాల్సి వస్తుంది. అంతే!" అని చెప్పాలని నిశ్చయించుకున్నాను. "చిన్నన్నయ్య పుస్తకాలు కొనుక్కు రమ్మన్నాడు. బజారు వెడుతున్నాను" అని అమ్మకి చెప్పి ఇంటినుంచి బయలుదేరాను.

శేఖరం ఇల్లు సమీపిస్తున్నకొద్దీ గుండెలు వేగంగా కొట్టుకోవటం ప్రారంభించాయి. అసలు అతను యింట్లో వున్నాడా? ఉన్నా నన్ను చూస్తాడా? చూస్తే మాత్రం మాట్లాడాడా? ఒకవేళ మాట్లాడినా - యిలాటి భయాలు, అనుమానాలు అనేకం చిన్న చిన్న పాముపిల్లల్లా నా చుట్టూ తిరగటం ప్రారంభించాయి. ఎంత తీవ్రంగానైనా అవమానించనీ,

ఎంత హీనంగానైనా చూడనీ, ఎంత క్రూరంగానైనా ప్రవర్తించనీ, నేను మాత్రం బాధపడను. చెప్పదలుచుకున్నది చెప్పి మరీ వస్తాను. గట్టిగా నిశ్చయాన్ని మరింత బలపరుచుకుని హాల్లో అడుగుపెట్టాను. ఇల్లంతా నిశ్శబ్దంగా ఉంది. హాల్లో వున్న పెద్ద గోడగడియారం మాత్రం నా గుండెల్లాగానే టిక్ టిక్ మంటోంది.

"ఇంట్లో ఉన్నారా?" నా కెదురుగా వచ్చిన నౌకర్ని అడిగాను.

వాడు ఉన్నారన్నట్టు తలూపి వెళ్ళిపోయాడు. "అగు" పిలిచాను. వాడు ఆగాడు,

"మీ కోసమే యెవరో ఆడవాళ్ళు వచ్చారని చెప్పిరా!"

వాడి కళ్ళలో లీలగా ఆశ్చర్యం తొంగిచూసింది. పైకి మాత్రం ఏమీ అనకుండా అలాగే అన్నట్టు చూసి వెళ్ళాడు.

"ఇదిగో - నిన్నే!" మళ్ళీ పిలిచాను.

ఏమిటన్నట్టు చూశాడు.

"నా పేరు చెప్పకు" అన్నాను ఎలాగో. ఈసారి వాడు నన్ను వింత మృగాన్ని చూసినట్టు చూసి వెళ్ళిపోయాడు.

అవును మరి, పేరుచెప్తే నాముఖం కూడా చూడడేమోనని భయం వేసింది.

హాల్లో వంటరిగా నిలబడి నేను ఆ పరిసరాలకి ఒకసారి, ఆఖరిసారి వీడ్కోలు చెబుతున్నట్టు చూశాను. నన్ను అంతా అదృష్టవంతురాలని అంటారు. చివరకి చిన్నన్నయ్య పెద్ద వదిన కూడా ఒప్పుకున్నారు. మరి అదృష్టం అంతా నా జీవితానికి అపురూపమైన ఈ విషయంలో ఏమైపో యింది? ఆడపిల్లకి ప్రేమించిన పురుషుని పొందలేక పోవడం కంటే ఘోరమైన దురదృష్టం ఇంకోటి యేముంది? అసలు యితను నాకెందుకు పరిచయం అయినట్టు, జీవితాంతం ఈ జ్ఞాపకంతో మనశ్శాంతి లేకుండా కుళ్ళి కుళ్ళి యేడవడానికి కాకపోతే? రచయిత్రిగా కాకపోతే నాలో ఇంకే ఆకర్షణా అతనికి కన్పించలేదా? ఎన్నోసార్లు తనకు నచ్చినట్లు, ముగ్ధుడైనట్టు పొగిడిన నా వ్యక్తిత్వం అతనికి గుర్తేరావటం లేదా? అతనితో నేనేం చూశాను? అతని డబ్బు చూడలేదు. గౌరవప్రతిష్ఠలు అంతకంటే చూడలేదు. కేవలం వ్యక్తిగా అతన్ని నేను ఆరాధించాను. ఆ సంగతి

అతని కెలా తెలుస్తుంది? అసలు స్త్రీ పురుషుల ప్రకృతిలోనే ఈ భేదం వుందేమో! అయినా నేనెంత బుద్ధిలేనిదాన్ని? రచయిత్రి కాలేకపోతే నాలో ఏం ప్రత్యేకత వుందని? లేదు, ఏ విధమైన ప్రత్యేకతా లేదు. మామూలు అమ్మాయిని. ఆంధ్రదేశంలోవున్న లక్షలమంది సాధారణమయిన ఆడ పిల్లల్లో నేనో ఆడపిల్లని. అంతే! అందని పళ్ళకి అర్రులు చాచిన మూర్ఖ రాలిని! ఎంత అణుచుకుందామన్నా నిట్టూర్పు ఆగలేదు.

వెనక అడుగుల శబ్దం విన్పించింది. నేనటు తిరిగాను. చేతి వాచికి కీ యిస్తూ, తనవైపే చూస్తున్నా పరధ్యాసగా యెక్కడో ఆలోచిస్తూ, శేఖరం క్రిందికి దిగివస్తున్నాడు. మధ్యలోనే తలయెత్తి చూసిన అతను క్షణం సేపు ఆగిపోయాడు. ఆ కళ్ళలో "నువ్వా!" అన్న భావం నేను గ్రహించక పోలేదు. నిదానంగా క్రిందికి దిగివచ్చాడు. నేను కదలిక లేకుండా అలాగే నిలబడ్డాను.

"వెతకపోయిన తీగె కాలికి తగిలిందే!" అన్నాడు వాచి చేతిని పెట్టు కుంటూ. ఆ కంఠంలో కోపంలేదు- ఆప్యాయత అసలేలేదు. అతి మామూ లుగా వుంది.

అతన్ని చూడగానే నేను చెప్పాలనుకున్నవన్నీ గాలిలో కలిసిపోయి నాయి. ఒక్కమాటకూడా గుర్తుకు రాలేదు. కళ్ళనిండా నీళ్ళు మాత్రం సుళ్ళు తిరగటం ప్రారంభించాయి. ఛీ!ఛీ! ఏడవకూడదు! ఏడుపెందుకు? ఏమీతెలియని అమాయకురాలిలా నటిస్తున్నానని అతను మరింత అస హ్యించుకోటానికా! క్రింది పెదవి పళ్ళతో గట్టిగా నొక్కిపట్టి కళ్ళల్లోనీళ్ళు జారకుండా నిగ్రహించుకున్నాను. తల వంచుకుని గబగబా బాగ్‌లో ఉంగరం తీసి అరచేతిలో వుంచుకుని అతనికి అందించాను.

సాధ్యమయినంత త్వరగా యిక్కడనుంచి వెళ్ళిపోవాలి. మాటలు కూడా అనవసరం.

"ఏమిటిది?" ఉంగరం వైపు, నావైపు మార్చి మార్చి చూస్తూ అడిగాడు.

"ఉంగరం. ఆరోజు మీరిచ్చింది!" తలెత్తి ధైర్యంగా అతని వైపు సూటిగా చూడాలని, యే బాధా లేనట్టు ముఖం పెట్టాలని మహా

పెనుగులాడుతున్నాను. కాని ప్రయోజనం లేకపోయింది.

"అంటే నీ ఉద్దేశ్యం?" నిశ్చలంగా అడిగాడు.

"నన్ను విపరీతంగా అసహ్యించుకునే వాళ్ళ జ్ఞాపక చిహ్నం నా దగ్గరుంచుకోవటం యిష్టంలేదు అంతటి ఔదార్యం నాకులేదు. నేను చాలా మామూలు మనిషిని."

"నువ్వంటే అసహ్యం పెంచుకుంటున్నానని ఎవరు చెప్పారు నీకు?"

"ప్రత్యేకంగా ఎవరూ చెప్ప నవసరంలేదు. దొంగతనం చేసిన వాడికి తను దొంగ అని తెలుస్తుంది."

"ఓహో!"

"దయయుంచి మీరు—మీది తీసుకుంటే—" నా గొంతు ఒణికింది.

"తీసుకుంటే:"

"నేను-నేను వెళ్ళిపోతాను. జన్మలో యిక మనిద్దరం కలుసుకోం. ఒకవేళ నే నేదయినా బాధపెట్టే క్షమించండి."

"ఉంగరం తిరిగి యిచ్చేస్తున్నట్టు మీ అన్నయ్యకి చెప్పావా?"

"చెప్పలేదు."

"ఎందుకని?"

"అవసరంలేదు."

"కారణం?"

నాకు తెలుసు. అతను నన్ను యేడిపించాలని, బాగా బాధపెట్టాలని నిర్ణయించుకున్నాడు.

"చెప్పు. కారణం ఏమిటి? నేను నిన్ను పెళ్ళి చేసుకో బోతున్నానని, రెండు, మూడు రోజుల్లో లగ్నాలు పెట్టించబోతున్నారనీ నీకు తెలియదా?"

"అబద్ధం! ఈ పెళ్ళి జరగదు!" తలెత్తి సూటిగా అతని కళ్ళలోకి చూస్తూ అన్నాను.

"అబద్ధాలాడటం, ఆడినమాట తప్పటం నాకు అలవాటులేవు."

నేను దెబ్బ తిన్నట్టు చూశాను. రోషం నా నరనరాల్లో మెలిక తిరిగి నా హృదయం భగ్గుమనేలా చేసింది. అందుకే నిర్భయంగా "నే

నేమీ అబద్ధం ఆడలేదు. మొదటినుంచి ఈ విషయం మీకు తెలియజేయా లని యెంత ప్రయత్నం చేశానో నాకు తెలుసు. మిమ్మల్ని మోసం చేస్తున్నానేమో, మీరు చూపించే అనురాగానికి అర్హురాలిని కానేమోనని క్షణ క్షణం ఎంత కుమిలిపోయానో ఆ భగవంతునికి తెలుసు"అన్నాను.

"కాని చూచాయగానయినా ఒక్కసారి కూడా నాకు తెలియజేయ లేదు, అంతేనా?"

క్షణంసేపు మా ఇద్దరి చూపులూ కలుసుకున్నాయి.

నాకెందుకో ఆ క్షణం అతన్ని చూస్తుంటే ఇక ఇతనికి నచ్చచెప్పా లనుకోవటం ఒట్టి వెర్రితనం, ఎడారిలో పూలు పూయించాలనుకోడం అంతే అన్పించింది.

"మీ ఉంగరం మీరు తీసుకోండి!" బ్రతిమలాడుతున్న ధోరణిలో అడిగాను.

"ఇవ్వు." చేయి జాచాడు.

ఉంగరం అతని చేతిలో పెట్టేసి చివ్వున వెనక్కు తిరగ బోయాను. కాని నా చేయి అతని చేతిలో చిక్కడిపోయింది. గట్టిగా పట్టుకొని అతను వదల్లేదు. నాకు తెలుసు, జరిగిన దానికి ప్రతీకారంగా నన్ను అవమానించటానికి అతని ఆఖరి అవకాశం వదులుకోడని. రోషంగా వెనక్కు తిరిగిన నేను విసురుగా చేయి గుంజుకోబోయాను.

అతను అప్పటికే నా కుడిచేయి వదిలినట్టే వదిలి యెడంచెయ్యి తీసుకుని దానికి ఉంగరం తొడిగి, సరిచేసి "వెళ్ళు" అన్నాడు.

పిల్లికి చెలగాటం, ఎలుకకి ప్రాణ సంకటంలా తయారైంది నా పని. అలాగే నిలబడి మాటకోసం తడుముకుంటున్న నన్ను చూసి, "ఒక్కసారి ఇచ్చింది తీసుకోవటం నా కలవాటులేదు - యేదయినా సరే!" అన్నాడు.

"అసహ్యించుకునేవాళ్ళ జ్ఞాపక చిహ్నాలు వుంచుకోవటం నాకసలే అలవాటు లేదు." దుఃఖం స్థానంలో విసుగురాగా కోపం వచ్చిన నేను బిగ్గరగా అన్నాను.

"నేనునిన్ను అసహ్యించుకోవటంలేదు. ఒకవేళ అసహ్యించుకున్నా మీ అన్నయ్యకి మాట ఇచ్చాను. ప్రాణంపోయినా ఆ మాట తప్పేదిలేదు.

నువ్వింతకంటే వేయి అబద్ధాలు ఆడినా, లక్ష రెట్లు మోసం చేసినా—కోటిసార్లు—"

"ఆపండి!"

"నేను నిన్ను పెళ్ళిచేసుకుతీరేది ఖాయం!"

"అసంభవం! నా కంఠంలో ప్రాణంవుండగా జరగదు" అసహనంతో అరిచాను.

శేఖరం చటుక్కున నా చేయి పట్టుకుని "యేమిటా అరుపులు? మతిపోయిందా?" అన్నాడు.

"పోలేదు కాబట్టే-మీ దయాధర్మం నాకవసరంలేదని చెబున్నాను. నేనిప్పుడే మా అమ్మకి-మా అన్నయ్యకి చెప్పేస్తాను." చేయి విడిపించుకోటానికి పెనుగులాడుతూ అన్నాను.

"ఏమని చెప్తావు?" చేయి వదిలేసి కుతూహలంగా చూశాడు.

"మీరంటే నా కసహ్యం అనీ, మీ అసలు వ్యక్తిత్వాన్ని గుర్తించాననీ చెప్తాను."

ఒకడుగు దగ్గరకు వేసి "యింకా...." అన్నాడు.

"మీరు గొప్పవాళ్ళని తప్ప కన్నెత్తి చూడరు. ఒకవేళ యిచ్చిన మాటకోసం చేసుకున్నా తర్వాత-తర్వాత-నేను మామూలు అమ్మాయినని, నాలో ఏం ప్రత్యేకత లేదని, మీకు సరిపోనని, అసహ్యించుకుని నా జీవితం నరకం-" వాక్యం పూర్తి చేయకుండానే కెవ్వుమన్నాను. వున్నట్టుండి నా శరీరం గాలిలోకి లేచింది. ఏమిటిది-అని నేను గ్రహించుకునేలోపలే శేఖరం రెండుచేతుల మధ్య ఎత్తి పైకి తీసుకెడుతున్నాడు. అతన్నుంచి విడిపించుకోవాలని గిలగిలా తన్నుకున్నాను. తీగెలా సాగాను. కాని ప్రయోజనం లేకపోయింది.

సరాసరి తీసుకొచ్చి తన గదిలో మంచంమీద కూలేసి "ఇప్పుడు చెప్పు?" అన్నాడు.

అతనింత దురుసుగా, మూర్ఖంగా ప్రవర్తిస్తాడని కల్లోకూడా అనుకోని నేను ఇంకా కళ్ళు పెదల్పుచేసుకుని అలాగే చూడసాగాను.

"ఊఁ! ఇంకా ఏమేమి చెప్పదలుచుకున్నావో చెప్పు. నీ ఇష్టం వచ్చినంత బిగ్గరగా కూడా అరు. అభ్యంతరంలేదు" అన్నాడు.

నేను సమాధానం చెప్పకుండా మంచంమీదనుంచి లేవబోయాను. కుడిచేయి నా భుజంమీద వేసి వారిస్తూ "పిచ్చి వూహలన్నీ మానెయ్యి. నాకంతా తెలిసింది. మీ అన్నయ్యలిద్దరూ వచ్చి 'మా చెల్లెలు నిర్దోషి' అని చెప్పటానికి 'గంట శ్రమపడ్డారు' అన్నాడు.

నేను రెప్పవాల్చకుండా అలాగే చూడసాగాను.

అతను మంచంమీద కూర్చుని నాచేయి తనచేతిలోకి తీసుకుంటూ-

"రాధా! వాళ్ళ ఉదయం నా కెంత నచ్చచెప్పాలని చూసినా నా కోపం పోనిమాట నిజమే. కాని ఈ రెండు రోజులనుంచి అహర్నిశలూ నేను దీన్ని గురించే ఆలోచిస్తున్నాను. ఓవిధంగా నీకంత పేరుప్రతిష్టలు లేవని, నువ్వు నేననుకున్నట్టు, అప్పుడప్పుడు ఆశించినట్టు మామూలు అనూరాధవే అని గుర్తువస్తే తృప్తిగా, నిశ్చింతగా వుంది. స్త్రీ ఫలానా పురుషుని భార్యగా గుర్తింపబడటానికి గర్విస్తుందేమో నాకు తెలియదు. కాని మగవాడు మాత్రం ఫలానా స్త్రీ భర్తగా గుర్తింపబడేకంటే చావడం నయం అనుకుంటాడు. భార్యాభర్తలు ఇద్దరూ సమానమైన పేరుప్రతిష్టలు కలిగివుంటే వేరేసంగతి. ఇద్దరిలో ఎవరిది ఆధిక్యత అంటే భార్య తల వంచినట్టుగా భర్త తలవంచలేడు. బహుశా మగవాడికి ఈ అహంకారం ప్రకృతే ప్రసాదించి వుంటుంది. ఆ రోజు మీ అన్నయ్యకి మాట యిచ్చాను నిజమే! ఆ వెళ్ళే అతనే- అని అంతా చూసి అనుకోవాలని గుర్తుకొస్తే బాధేసేది. ఓ విధంగా మన వివాహానికి అప్పుడు నా వ్యక్తిత్వాన్ని త్యాగం చేస్తున్నాను అనిపించేది. త్యాగంతో మొదలయిన వివాహంలో అనురాగం చాలా అరుదు అనుకుంటా. నువ్వు రచయిత్రివైతే నానుంచి నిన్ను లాక్కుపోయే సన్మానాలు, పార్టీలు, నా అభిమానాలు చాలా మనమధ్య వుండేవి. ఎంత నిగ్రహించుకున్నా అప్పుడప్పుడు వాటితోనాకు యుద్ధం తప్పేదికాదు. ఇప్పుడు అవేవీలేవు. నీ ప్రపంచం నా చుట్టూనే వుంటుంది. నా ఊహలు, నా గురించి, మన ఇంటిని గురించి మన పిల్లలవరకే పరిమితం అవుతుంది.

ువ్వు రచయిత్రివి కాదన్న వూహ నిన్ను ఇంకా నా దగ్గరికి ఎంత
ాగిందో నాకు తెలియదు."

"మీరు....మీరు.... కాని-" నాకెన్నో చెప్పాలనిపిస్తోంది. కాని
ంతోషం వాటికి వేటికి అవకాశం యివ్వటంలేదు.

"నా రాధా! అసలు మొట్టమొదట వనితామండలి వాళ్ళదగ్గర
న్ను చూసినప్పుడే నువ్వు రచయిత్రివి అంటే నాకు నమ్మబుద్ధికాలేదు.
రూపం, నీ అమాయకత్వం నన్ను ఆకర్షించి, నీ పరిచయం చేసుకుని
తరఫున వాళ్ళకి పాఠం నేర్పేలా నన్ను పురికొల్పినాయి."

"మీరు....మీరిప్పుడు చెప్పినదంతా నిజమై, నిజంగా మీరు ఈఒక్క
ారికి నన్ను క్షమించి నాకు అవకాశమిస్తే— ముందెన్నడూ యిలాటిది
రగదు. నేను యెప్పుడూ అబద్ధం ఆడను, ఒట్టు" అన్నాను.

"అలాగేనండీ రాధాదేవిగారూ!" శేఖరం నా చేతికున్న ఉంగరం
రిచేస్తూ అన్నాడు.

"హమ్మయ్య! నా కిప్పుడు ధైర్యం వచ్చింది." గుండెలనిండా గాలి
ల్చుకున్నాను.

నా చేతి ఉంగరాన్ని అటూ ఇటూ తిప్పుతూ ఆలోచిస్తున్న అతను
టుక్కున ఆగి "రాధా! నానుంచి నీకేం రహస్యాలు లేవుగా! ఉంటే
ప్పుడే చెప్పెయ్యి" అన్నాడు.

"ఏం లేవు."

"ఏమీ?"

"ఏమీ లేవు." నొక్కి పలికాను.

"సరిగ్గా ఆలోచించావా?"

"సరిగ్గానే ఆలోచించాను."

"నిన్ను అనూ అని ఎవరూ పిలవరూ?"

"ఎవ్వరూ పిలవరు." తల అడ్డంగా వూపాను.

"మరి? మరి ఆ రోజు అలా ఏడ్చేశా వెందుకు?"

నా పెదవులు చిరునవ్వుతో విచ్చుకున్నాయి. "అది అనూ అ పిలిచినందుకు కాదు. మీరంతా ఆప్యాయంగా చూస్తుంటే నిజం చెప్పలే పోతున్నానే అనే బాధతో—నిజంగా యింకేం లేదు. భగవంతుని సాక్షి చెబుతున్నా."

క్షణంసేపు నా వైపు పరిశీలనగా చూసిన శేఖరం నన్ను మెల్లి దగ్గరకు తీసుకుంటూ "అనూ! జీవితంలో ఎప్పుడూ దేనికీ నువ్వు భ పడాల్సిన అవసరం లేదు. ఏ విషయాన్నయినా సూటిగా నా ముఖంమీ చెప్పెయ్యొచ్చు. ఆ అధికారం నీ కెప్పుడూ వుంటుంది. అబద్ధాలు ఆ వాళ్ళంటే ఎందుకో నా కసహ్యం. వాళ్ళ నీడనికూడా నేను భరించలేన అన్నాడు.

నేను నిశ్శబ్దంగా అతని చేతుల్లో ఒదిగిపోయాను. శేఖరంలాం వ్యక్తి లభించినప్పుడు యే ఆడదానికయినా అబద్ధం ఆడే అవసస ఎందుకొస్తుంది? రాదు- ఎప్పటికీ రాదు!